ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
మంగళవారం 29 ఏప్రిల్ 2025



సమాజ సేవకులను ప్రోత్సహించాలి

- ఒడిశా గవర్నర్ డాక్టర్ హరిబాబు

-వార్త 8వ పేజీలో



బీఎన్ రోడ్డుకు మోక్షం లేదా?

ప్రకటనలకే పరిమితమైన కూటమి నేతల మాటలు

- అధికారంలోకి వచ్చి పది నెలలు దాటినా మొదలుకాని పనులు
- గోతులతో మరింత అధ్వానంగా మారిన రహదారి
- వర్షాలు మొదలైతే ప్రజలకు తీవ్ర ఇక్కట్లు



అంభేరుపురం సమీపంలో బీఎన్ రోడ్డుపై చెరువును తలపిస్తున్న భారీ గొయ్యి (ఫైల్ ఫొటో)

చోడవరం, ఏప్రిల్ 28: చోడవరం నియోజకవర్గంలో ప్రధానమైన భీమునిపట్నం- నర్సీపట్నం (బీఎన్) రోడ్డు నానాటికీ తీసికట్టుగా తయారవుతున్నది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధ్వానంగా తయారైన ఈ రోడ్డు.. కూటమి అధికారంలోకి వచ్చి పది నెలలు దాటినా పరిస్థితిలో ఎటువంటి మార్పులేదు. 'కాంట్రాక్టర్లతో మాట్లాడాం. పనులు ప్రాంభం అవుతాయి' అని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు చేస్తున్న ప్రకటనలు కార్యరూపం దాల్చడంలేదు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ స్వయంగా కాంట్రాక్టర్‌తో మాట్లాడినా.. రోడ్డు నిర్మాణ పనులు మొదలు కాలేదు. మరో ఐదారు వారాల్లో వర్షాకాలం మొదలవుతుంది. అప్పటి నుంచి రవాణా కష్టాలు మరింత పెరుగుతునాయని ఈ మార్గంలో తరచూ ప్రయాణించే ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బీఎన్ రోడ్డులో చోడవరం మండలం గంధవరం నుంచి రోలుగుంట మండలం వెలంకాయలపాలెం వరకు 45 కిలోమీటర్లు, బీఎన్ రోడ్డులో వడ్డాది నుంచి మాడుగుల మండలం తాటిపర్తి వరకు 15 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రహదారుల విస్తరణ, అభివృద్ధికి న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్‌డీబీ) రూ.130 కోట్లు మంజూరు చేసింది. కానీ వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్డు పనులు జరగలేదు. మరోవైపు నిర్వహణ పనులు కూడా చేయకపోవడంతో రహదారులు మరింత ఛిద్రమై అధ్వానంగా తయారయ్యాయి. అడుగడుగునా గోతులు ఏర్పడి, రానురాను పెద్దవి కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చోడవరం, మాడుగుల నియోజకవర్గాల ప్రజలు గత ఎన్నికల్లో ఇక్కడ వైసీపీ అభ్యర్థులను ఘోరంగా ఓడించారు. ఎన్నికల తరువాత కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో బీఎన్ రోడ్డు, వడ్డాది- తాటిపర్తి రోడ్ల పనులు ప్రారంభం అవుతాయని ప్రజలు భావించారు. వడ్డాది- తాటిపర్తి రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు మొదలై జోరుగా సాగుతున్నాయి. కానీ బీఎన్ రోడ్డు పనులు మాత్రం ప్రారంభం కాలేదు. అక్కడక్కడ తాత్కాలికంగా గుంతలను పూడ్చినా, పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చింది. స్థానిక నాయకుల ... మిగతా 8వ పేజీలో



విజయరామరాజుపేట వద్ద ఏడాదిన్నర క్రితం కూలిన వంతెన

డీసీసీబీ చైర్మన్‌గా కోన తాతారావు



కోన తాతారావు

జనసేన కోటాలో ఎంపిక

- రెండు, మూడు రోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్‌గా కోన తాతారావును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం ఆదేశాలు ఇచ్చింది. ప్రస్తుతం తాతారావు జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా ఉన్నారు. నామినేటెడ్ పదవుల పంపకంలో కూటమి పార్టీల మధ్య ఉన్న అవగాహన మేరకు విశాఖ డీసీసీబీ పోస్టును జనసేనకు కేటాయించడంతో తాతారావుకు అవకాశం లభించింది.

రాష్ట్రంలో సహకార బ్యాంకులు, సొసైటీలకు 2018 తరువాత ఎన్నికలు నిర్వహించలేదు. అప్పటి నుంచీ రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉన్నా తమ పార్టీకి చెందిన వారిని చైర్మన్లుగా నామినేట్ చేస్తూ వస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం చివరిలో డీసీసీబీ చైర్మన్‌గా నియమితులైన కోలా గురువులు గత ఏడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి జాయింట్ కలెక్టర్ పర్సన్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో కూటమి ప్రభుత్వం సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని భావించింది. అయితే అది కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో సోమవారం నామినేటెడ్ పద్ధతిలో చైర్మన్లను నియమించింది. చైర్మన్‌గా కోన తాతారావు నియామకంపై రెండు, మూడు రోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు వెలువడనున్నాయి. ఆయనతోపాటు డీసీసీబీ బోర్డులో మరో ఆరుగురిని ప్రభుత్వం నియమించనున్నది. ఇదిలావుండగా ఈనెల ఎనిమిదో తేదీన కోన తాతారావు పరవాడ మండలం లంకెలపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యత్వం తీసుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో 30కుపైగా బ్రాంచీలు, 98 సహకార సంఘాలు కలిగిన డీసీసీబీ రాష్ట్రంలో అత్యధిక వ్యాపార లావాదేవీలు జరిపే ఐదింటిలో ఒకటిగా ఉంది.

ఉక్కు ఉద్యోగం వదిలి రాజకీయాల్లోకి...

పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన కోన తాతారావు న్యాయశాస్త్రంలో పట్టభద్రులు. నిర్వాసితుడు కోటాలో విశాఖ ఉక్కు కర్మాగారంలో ఉద్యోగిగా చేరి మేనేజర్ హోదా వరకూ పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. అనంతరం రాజకీయ ప్రవేశం చేశారు. తొలుత పెదగంట్యాడ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన తాతారావు ఉమ్మడి రాష్ట్రంలో 1993లో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా, తరువాత చైర్మన్‌గా సేవలు అందించారు. 2004లో కాంగ్రెస్ పార్టీని వదిలి తెలుగుదేశంలో చేరిన తాతారావు 2007లో కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. జీవీఎంసీలో టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌గా, 2009లో అర్బన్ జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. 2018లో టీడీపీని వీడి జనసేనలో చేరిన తాతారావు ప్రస్తుతం ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా ఉన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా కోట్ని బాలాజీ

- టీడీపీకి అందిస్తున్న సేవలకు దక్కిన ప్రతిఫలం



కోట్ని బాలాజీ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్‌గా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అనకాపల్లి మండలం బవులవాడ గ్రామానికి చెందిన బాలాజీ చాలా ఏళ్ల నుంచి తెలుగుదేశం పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నారు. 2013లో తెలుగునాడు విద్యార్థి సంఘం (టీఎన్ఎస్ఎఫ్) ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షునిగా వ్యవహరించారు. అదే ఏడాది రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో జేఏసీ తరఫున పోరాటం చేశారు. టీడీపీ భీమిలి నియోజకవర్గ పరిశీలకునిగా, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రతినిధిగా సేవలు అందించారు. గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేశారు. పార్టీకి ఆయన అందించిన సేవలకుగాను ప్రభుత్వం డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమించింది.

చందనోత్సవానికి సర్వం సిద్ధం





భక్తుల దర్శనానికి సింహగిరిపై ఏర్పాటు చేసిన క్యూలైన్లు

- 2 లక్షల మంది భక్తులకు తగ్గ ఏర్పాట్లు
- రేపు ఉదయం 4 గంటల నుంచి దర్శనాలు
- సింహగిరిపైకి భక్తుల సొంత వాహనాలకు అనుమతి లేదు
- దేవస్థానం ఈఓ కొమ్ముల సుబ్బారావు

సింహాచలం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహ స్వామి నిజరూప దర్శనం (చందనోత్సవం) కోసం రెండు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేసి, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు పూర్తిచేసినట్టు దేవస్థానం ఈవో కొమ్ముల సుబ్బారావు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, ఈ ఏడాది రూ.1500, రూ.1000, రూ.300 టికెట్లు విక్రయిస్తున్నామని, ప్రవేశ ద్వారం వద్ద, లోపల పంచింగ్, స్కానింగ్ చేయడం ద్వారా రీసేల్‌ను నిరోధించనున్నట్టు ... మిగతా 8వ పేజీలో

విశాఖ రియల్టర్ మామిడిపల్లిలో ఆత్మహత్య

- రిసార్టులో ఉరి వేసుకుని బలవన్మరణం
- ఆర్థిక ఇబ్బందులే కారణమంటూ లేఖ

దేవరాపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మామిడిపల్లిలో వున్న ఒక ప్రైవేటు రిసార్టులో విశాఖకు చెందిన ఒక రియల్టర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే బలవన్మరణానికి పాల్పడుతున్నట్టు లేఖ రాశారు. దీనికి సంబంధించి ఇన్‌చార్జ్ ఎస్.ఐ. ఆర్. దనుంజయ్ తెలిపిన వివరాలిలా వున్నాయి.

విశాఖపట్నంలోని సీతమ్మధారకు చెందిన నడింపల్లి సత్యనారాయణరాజు (70) నాలుగు దశాబ్దాల నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆయనకు పలువురు డబ్బులు చెల్లించకపోవడంతో బకాయిలు రూ.కోట్లకు చేరాయి. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో తీవ్రంగా దెబ్బతిన్నాడు. కాగా దేవరాపల్లి మండలం మామిడిపల్లిలోని ఒక ప్రైవేటు రిసార్టుకు తరచూ వచ్చి పోతుంటాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఇక్కడకు వచ్చిన వచ్చిన ఆయన రాత్రికి ఇక్కడే బసచేశాడు. సోమవారం ఉదయం రిసార్టు మేనేజర్ రాయి శివ నిద్ర లేచే సరికి గది బయట ఉన్న ఉయ్యాల కొక్కేనికి సత్యనారాయణరాజు ఉరి వేసుకొని కనిపించాడు. వెంటనే రిసార్టు యాజమానికి ఫోన్ చేసి, ఆయన ... మిగతా 8వ పేజీలో

మేయర్ పీఠంపై పీలా

ఏకగ్రీవంగా ఎన్నిక

- ప్రత్యేక కౌన్సిల్ సమావేశానికి 59 మంది కార్పొరేటర్లు, ఎనిమిది మంది ఎక్స్‌అఫీషియో సభ్యులు హాజరు
- జీవీఎంసీ కార్యాలయం వద్ద టీడీపీ కార్యకర్తల సంబరాలు
- కార్పొరేషన్ ఏర్పాటైన తర్వాత టీడీపీ నుంచి మేయర్‌గా ఎన్నికైన రెండో వ్యక్తి



మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావును అభినందిస్తున్న కార్పొరేటర్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) నూతన మేయర్‌గా టీడీపీకి చెందిన 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత మేయర్ గొలగాని హరివెంకటకుమారిపై ఈనెల 19న కూటమి కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఆమె పదవిని కోల్పోయిన విషయం తెలిసిందే. కొత్త మేయర్ ఎన్నిక కోసం సోమవారం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం జరిగింది. జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ మయూర్ ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు.

కౌన్సిల ప్రత్యేక సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. సభకు ... మిగతా 8వ పేజీలో

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- క్షేత్రస్థాయిలో పర్యటిస్తే సమస్యలపై అవగాహన
- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం
- నర్సీపట్నంలో పీజీఆర్ఎస్ నిర్వహణ
- ప్రజల నుంచి 257 అర్జీలు స్వీకరణ





పీజీఆర్ఎస్‌లో ఓ మహిళ సమస్యను ఆలకిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, పక్కన జేసీ జాహ్నవి, అర్జీదారులతో కిక్కిరిసిన రిజిస్ట్రేషన్ కౌంటర్

నర్సీపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజలు అందజేసిన అర్జీలకు సంబంధించిన సమస్యలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవితో కలిసి పీజీఆర్ఎస్ నిర్వహించారు. ప్రజలు ఇచ్చిన అర్జీలపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వర పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. అనతరం మండల, డివిజన్ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలపై సమీక్ష నిర్వహించారు. చిన్నచిన్న సమస్యలను ఇక్కడే పరిష్కరిస్తే ప్రజలు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం ఉండదని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా, పరిష్కరించడానికి వీలుకాని సమస్యల గురించి సంబంధిత ఆర్జీదారులకు అర్థం అయ్యే విధంగా చెప్పాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే సమస్యలపై అవగాహన వస్తుందని, నిర్ణీత సమయంలో సమస్యను పరిష్కరించ గలుగుతారని అన్నారు.

పీజీఆర్ఎస్‌లో 257 అర్జీలు

కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీదారులు పోటెత్తారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఫిర్యాదుల ... మిగతా 8వ పేజీలో

గంజాయి కేసులో ముగ్గురికి పదేళ్ల జైలు, జరిమానా

చోడవరం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కేసులో నేరం రుజువు కావడంతో ముగ్గురికి పదేళ్ల జైలుశిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ స్థానిక 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి కె.రత్నకుమార్ సోమవారం తీర్పు ఇచ్చారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. చీడికాడ మండలం బైలపూడికి చెందిన జాజిమొగ్గల సంతోశ్, గెంజి మరిడిబాబు, జాజిమొగ్గల దేముడు 2015లో వంద కిలోల గంజాయిని రవాణా చేస్తుండగా అప్పటి చీడికాడ ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు వారిని పట్టుకుని గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ కేసులో పోలీసులు సమగ్రంగా సాక్ష్యాలు కోర్టు ముందు ఉంచగా, ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ఉగ్గిన వెంకటరావు నేరాన్ని రుజువుచేయడంతో నిందితులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. లక్ష రూపాయలు జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు సాధారణ జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

పేద విద్యార్థులకు దూరమైన బడి


రక్షణ గోడ లేదన్న కారణంగా మూతపడ్డ ఎంపీపీ పాఠశాల-3

రక్షణ గోడ లేని కారణంగా ఎంపీపీ పాఠశాల-3 తరలింపు

దూరం కావడంతో పిల్లలను పంపని తల్లిదండ్రులు

ఈ విద్యా సంవత్సరానికి పునరుద్ధరించాలని డిమాండ్

మునగపాక, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): శతశాతం అక్షరాస్యత లక్ష్యంగా ప్రభుత్వాలు విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నా.. అధికారులు తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు పేద విద్యార్థులకు చదువును దూరం చేస్తున్నాయి. సమస్య చిన్నదైనప్పటికీ వారి నిర్లక్ష్యం కారణంగా పేద విద్యార్థులకు విద్యాభ్యాసానికి దూరం అవుతున్నారు. మండల కేంద్రం మునగపాకలో విద్యార్థుల సంఖ్య, ప్రాంతాలకు అనుగుణంగా నాలుగు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేశారు. వాటిలో సంతబయల ప్రాంతంలో ఎంపీపీ పాఠశాల-3 ఉంది. ఈ పాఠశాల పరిధిలో రజకులు, యాదవులు, శెట్టిబలిజ తదితర సామాజిక వర్గాల వారు నివాసముంటున్నారు. అత్యధిక శాతం కుటుంబీకులు వారి పిల్లలను ఈ పాఠశాలలోనే చదివిస్తున్నారు. పాఠశాలకు రక్షణ గోడ లేని కారణంగా ఏడాది క్రితం ఎంపీపీ పాఠశాల-1కు తరలించారు. ఇది దూరం కావడంతో పిల్లలను తల్లిదండ్రులు పంపడం లేదు. ఎంపీపీ పాఠశాల-3లో 1,2 తరగతుల్లో కేవలం ఏడుగురు విద్యార్థులు మాత్రమే విద్యనభ్యసిస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి రక్షణ గోడతోపాటు టాయిలెట్స్ నిర్మాణం చేపట్టాలని విద్యార్థులు తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. వెనుకబడిన ప్రాంతంతోపాటు నిరుపేద, కూలి కుటుంబాలకు చెందిన వారు పిల్లలు ఉన్నారని అధికారులకు, పాలకులకు తెలిసినా చిన్న సమస్యపై నిర్లక్ష్యం చూపుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. పాఠశాలను మూసివేయడం కోసమే జాప్యం చేస్తున్నారంటూ ఆ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు.

రక్షణ గోడ కోసం చేయని ప్రయత్నం లేదు : ఎంఈవో


వేణుగోపాలరావు, ఎంఈవో

మునగపాక ఎంపీపీ పాఠశాల-3కు రక్షణ గోడ లేకపోవడం వలనే మరో పాఠశాలలో బోధన అందిస్తున్నామని ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు వివరణ ఇచ్చారు. పాఠశాలను ఆనుకొని చెరువు ఉండడం వలన పిల్లల రక్షణను దృష్టిలో పెట్టుకొనే మరో పాఠశాలకు తరలించామని చెప్పారు. రక్షణగోడతోపాటు టాయిలెట్స్, బాతురూమ్‌లు నిర్మాణం జరగాల్సి ఉందన్నారు. నిధులు మంజూరు, నిర్మాణం కోసం ఎంపీడీవోకు, మునగపాక సర్పంచ్‌కు, చివరకు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దృష్టికి కూడా తీసుకు వెళ్లడం జరిగిందని తెలిపారు. సీఎస్ఆర్ నిధులకు ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే విజయకుమార్ చెప్పారన్నారు.

కోటవురట్లలో భారీ వర్షం


కోటవురట్లలో కురుస్తున్న వర్షం

కోటవురట్ల. ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎండతోపాటు తీవ్ర ఉక్కపోతతో ప్రజలు సతమతమయ్యారు. అనంతరం వాతావరణంలో మార్పులు వచ్చి ఈదురుగాలులతో కూడిన భారీవర్షం గంటసేపు కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు. మండలంలో కోటవురట్ల, కైలాసపట్నం, పందూరు, రాజుపేట,రామచంద్రపురం గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఈ వర్షం వేసవిలో సాగుచేస్తున్న పంటలకు ఊపిరిపోసింది. మెట్టప్రాంతాల్లో సాగునీరు లేక ఎండిపోతున్న పంటలకు ఎంతో మేలు చేసిందని రైతులు తెలిపారు.

ప్రధాన రోడ్డుపై పొంచి ఉన్న ప్రమాదం

- **శేషుగెడ్డ కాలువ కల్వర్టుపై రక్షణ గోడ లేని వైనం**
- **అదుపు తప్పితే వాహనం కాలువలోకే..**
- **పట్టించుకోని పాలకులు, అధికారులు**


ప్రమాదభరితంగా రక్షణ గోడ లేకుండా ఉన్న కల్వర్టు

ఎలమంచిలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందలాది వాహనాల ద్వారా రాకపోకలు సాగించే ప్రధాన రోడ్డుపై ప్రమాదం పొంచి ఉన్నా.. అటు పాలకులు గానీ అధికారులు గానీ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎలమంచిలి నుంచి అనకాపల్లి వైపు నిత్యం బస్సులు, స్కూలు పిల్లలను తరలించే ఆటోలు, అన్ని వర్గాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు, పాలకులు ఇదే రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. పట్టణ సమీపంలో పోలీస్ సర్కిల్ కార్యాలయం వద్ద శేషుగెడ్డ కాలువపై ఉన్న కల్వర్టు వద్ద ఈ పరిస్థితి నెలకొంది. ఏదైనా వాహనం రక్షణ గోడలు లేని ఈ కల్వర్టు వద్ద అదుపు తప్పితే ఊహించని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికారుల కార్యాలయం ఉండే ఎలమంచిలిలోని ఈ దుస్థితిని పట్టించుకోకపోతే ఇంకా మారుమూల ప్రాంతాల్లోని పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని పలువురు అంటున్నారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పాలకులు ప్రతిపాదనలు పంపారు. కానీ ఈ కల్వర్టు వద్ద ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. ఏళ్లు గడిచిపోయినా సరే ఈ ప్రమాదకర పరిస్థితి మారలేదు. ఈ శేషుగెడ్డలో వరద నీరు అధికమైతే ప్రధాన రోడ్డుపై ప్రవహించే సందర్భాలు అనేక సార్లు చోటుచేసుకున్నాయి. ఇటువంటి సమయాల్లో వాహనాల రాకపోకలు గంటల తరబడి నిలిచిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఈ కల్వర్టు వద్ద రక్షణ గోడ నిర్మించేందుకు ఉన్నతాధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఏపీఐఐసీ మెరైన్ అవుట్‌ఫాల్ పరిహారం పంపిణీలో అవకతవకలు

- **కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మత్స్యకార యువ నేత**

అచ్యుతాపురం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీ మెరైన్ అవుట్‌ఫాల్ పరిహారం పంపిణీలో భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయని, దీనిపై విచారణ జరపాలని పూడిమడకకు చెందిన మత్స్యకార యువనాయకుడు కారె నూకరాజు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సెజ్ కర్మాగారాల్లో వ్యర్థాలను శుద్ధి చేసిన తర్వాత పూడిమడక సముద్రంలో కలపడానికి పైప్‌లైన్ నిర్మాణం 2016లో ఏపీఐఐసీ చేయతలపెట్టిందన్నారు. వ్యర్థ జలాలు సముద్రంలో కలవడం వల్ల మత్స్య సంపద నశించి తాము జీవనోపాధి కోల్పోతామని మత్స్యకారులు అప్పట్లో ఆందోళనలు చేయడంతో ప్రభుత్వం కుటుంబ యజమానితోపాటు 18 ఏళ్లు నిండిన వారికి కూడా రూ.1.25 లక్షలు ఇవ్వడానికి అంగీకరించిందన్నారు. ఈమేరకు పరిహారం పంపిణీ కూడా జరిగిందని, కాని అర్హులైన చాలా మందికి పరిహారం అందలేదని ఆయన ఆరోపించారు. అలాగే చాలామంది అనర్హులకు ప్యాకేజీ అందిందని. దీనిపై గత ఐదు సంవత్సరాలుగా పోరాడుతున్నా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. . ప్రస్తుత ప్రభుత్వం దీనిపై సమగ్ర విచారణ జరిపి అర్హులకు ప్యాకేజీ అందజేయాలని ఆయన కోరారు.

డిప్యూటీ సీఎం,హోంమంత్రి దృష్టికి జంగులూరు సమస్య

- **జనసేన నియోజకవర్గ నేత గెడ్డం బుజ్జి**


జంగులూరులో జనసేన నాయకులతో మాట్లాడుతున్న గెడ్డం బుజ్జి

ఎస్.రాయవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగులూరులో సోమవారం జనసేన పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ నాయకుడు గెడ్డం బుజ్జి పర్యటించారు. కొన్ని రోజుల క్రితం జేవీపాలెం జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు గొర్లి సతీష్‌కు చెందిన జంగులూరులో ఇంటికి తాగునీటి కొళాయి తొలగించి, తిరిగి ఏర్పాటు చేయకుండా స్థానిక టీడీపీ నేత కావాలని అడ్డుకుంటారని గెడ్డం బుజ్జి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గెడ్డం బుజ్జి ఆ గ్రామంలో పర్యటించి కొళాయి తొలగించిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక సచివాలయానికి వెళ్లి తొలగించిన తాగునీటి కొళాయిని వెంటనే ఏర్పాటు చేయాలని అక్కడి సిబ్బందిని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించకుంటే, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనిత దృష్టికి ఈ సమస్యను తీసుకువెళతాయనన్నారు. కార్యక్రమంలో స్థానిక జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల శివ, మండల యూత్ ప్రెసిడెంట్ లింగంపల్లి జ్యోతికుమార్, ఉప్పరాపల్లి, సర్వసిద్ధి, పెట్టుగోళ్లపల్లి గ్రామాల పార్టీ అధ్యక్షులు అరవింద్, రాజా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి కూలీల వేతనాలను చెల్లించాలి'

మునగపాక, ఏప్రిల్ 28 (ఆంధ్రజోతి): ఉపాధి కూలీలకు వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకుడు ఎస్.బ్రహ్మాజీ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలవి రోజు వారి జీవితాలని, వారం, నెలలు తరబడి కూలి ఇవ్వకపోతే కుటుంబ పోషణ కష్టతరమన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన స్పందనలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో దాడి భాస్కరరావు, టి.చిన్నసూరిఅప్పారావు, గాలి అప్పారావు, మొల్లి అప్పారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎస్.రాయవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఎస్.రాయవరం రూరల్ ఫీడర్‌లో గల సైతారుపేట, సర్వసిద్ధి, ఉప్పరాపల్లి, వెంకటాపురం, కర్రివానిపాలెం, లింగరాజుపాలెం, పేటసూదిపురం, జేవీ పాలెం, బసవపాడు, వాకపాడు గ్రామాల్లో మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపుతోపాటు ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : సీఐ


పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్‌లో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

ఎస్.రాయవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులంతా చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా వాటికి దూరంగా ఉండాలని నక్కపల్లి రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. మండలంలోని పెదగుమ్ములూరు జడ్పీ హైస్కూల్‌లో పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్‌ను సోమవారం సీఐ రామకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్‌తో నిరుపేద విద్యార్థుల భవిష్యత్తు బాగుపడుతుందన్నారు. అలాగే ప్రతీ ఒక్కరూ మొబైల్ ఫోన్ వాడకాన్ని చాలా వరకు తగ్గించి, విద్యతో పాటు ఆరోగ్యం, క్రమశిక్షణ పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండకర్ల టీడీపీ అధ్యక్షుడిగా నర్సింగరావు


కొండకర్లలో ఎంపికైన కమిటీ సభ్యులతో టీడీపీ నాయకులు

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 28, (ఆంధ్రజ్యోతి):మండలంలోని కొండకర్ల గ్రామంలో సోమవారం టీడీపీ గ్రామ కమిటీ ఎన్నికలో అధ్యక్షుడిగా దాసరి నర్సింగరావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. జనరల్ సెక్రటరీగా బోదపు సుధాకర్, కోశాధికారిగా కంఠంరెడ్డి కుసుమ, ఉపాధ్యక్షుడిగా పొలమరశెట్టి భాగ్యనాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కోసూరి భానుప్రకాష్, కుంచ రమణ, నకరబోయిన రమణాజీ, సభ్యులుగా పాసిల అప్పలరాజు, కట్టుమూరి వరలక్ష్మి, శిరసపల్లి అనురాధలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ అభివృద్ధికి తాము కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

గూడుపమ్మకు ప్రత్యేక పూజలు


అమ్మవారికి సింహహారతి

నక్కపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గూడుపమ్మ క్షేత్రంలో వైశాఖ మాసం తొలిరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ గర్భగుడిలో పలురకాలు పండ్లు పుష్పాలతో అలంకరించారు. అనేకమంది భక్తులు పండ్లు పుష్పాలతో ఆలయ ప్రదక్షణ చేశారు. ఆలయ ధర్మకర్త గొట్టుముక్క ల శ్రీహరిరాజు ఆధ్వర్యంలో అన్నప్రసాదాలు పంపిణీచేశారు.

దుర్గానగర్ ప్రాంతంలో పర్యటించిన అధికారులు


దుర్గాకాలనీలో ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

పాయకరావుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పోలవరం ఎడమ కాలువ పనుల్లో భాగంగా కొండను బ్లాస్టింగ్ చేస్తున్న కారణంగా ఇళ్లు దెబ్బతింటున్నాయని అందిన ఫిర్యాదు మేరకు ఆయా ప్రాంతాల్లో సోమవారం అధికారులు పర్యటించారు. నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తహసీల్దారు జి.సత్యనారాయణ, సీఐ జి.అప్పన్న దుర్గానగర్, దుర్గాకాలనీలో జరుగుతున్న ఇంటింటి సర్వే పనులు పరిశీలించారు. కంట్రోల్ బ్లాస్టింగ్ చేపట్టి పరిస్థితులు సమీక్షించారు. ఈ సందర్భంగా తహసీల్దారు సత్యనారాయణ మాట్లాడుతూ బ్లాస్టింగ్ జరిగిన సమయంలో నివాస ప్రాంతాల్లో భూమి చిన్నగా కదిలినట్టు ఉంది తప్పితే ఇళ్లు దెబ్బతినేంత తీవ్రంగా లేదన్నారు.

అవగాహనతో నాణ్యమైన దిగుబడులు : ఏవో

మునగపాక, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా పొద్దుతిరుగుడు పంటలో నాణ్యమైన దిగుబడులు పొందవచ్చునని మండల వ్యవసాయాధికారిణి సీహెచ్.జ్యోత్స్నకుమారి అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేటలో బీసీటీ-కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన నూనె గింజల క్షేత్ర దినోత్సవం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో బీసీటీ శాస్త్రవేత్తలు ప్రసాదరావు, వ్యవసాయ సహాయకులు శ్వేత, మళ్ల సంజీవరావు, గోవింద తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

మునగపాక, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): బాలికలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా బాలల సంరక్షణ విభాగం కార్యకర్త కేఎల్‌వీ.రమ్య తెలిపారు. మండలంలో కాకరాపల్లి గ్రామంలో సోమవారం బాలల సంరక్షణ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొల్లు ముసిలినాయుడు, కార్యదర్శి రాజాబాబు, వీఆర్వో కోటేశ్వరరావు, ఎఎన్ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దొంకాడలో విద్యుత్ అంతరాయంపై ఫిర్యాదు

నక్కపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గాలివేసినా.. వర్షం కురిసినా.. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని దొంకాడ గ్రామ వినియోగదారులు ఈపీడీసీఎల్ నక్కపల్లి అధికారులకు సోమవారం ఫిర్యాదుచేశారు. గాలిపెద్దగా వేస్తే రెండు రోజులు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వారు తెలిపారు. సిబ్బందికి ఫోన్ చేసినా స్పందించడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.

కలెక్టరేట్ వద్ద నామవరం వర్మీకంపోస్టు విక్రయ కేంద్రం


కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన నామవరం వర్మీ కంపోస్టు విక్రయ కేంద్రం

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నామవరం సంపద తయారీ కేంద్రంలో ఉత్పత్తి అయిన వర్మీకం పోస్టును సోమవారం అనకాపల్లి కలెక్టరేట్ వద్ద విక్రయించారు. ఈ సందర్భంగా నామవరం పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునాచారి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు సంపద తయారీ కేంద్రంలో ఉత్పత్తి అయిన వర్మీకంపోస్టును అనకాపల్లి కలెక్టరేట్ వద్ద కౌంటర్ ఏర్పాటు చేసి విక్రయించామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది హుస్సేన్, డీపీఆర్‌సీ దేవుడు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీరామరక్ష రథయాత్ర



రాంబిల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో గత వారం రోజులుగా జరుగుతున్న శ్రీరామరక్ష రథయాత్ర సోమవారంతో ముగిసింది. మర్రిపాలెం, కుమ్మరాపల్లి, మురకాడ, రజాల, కట్టుబోలు, దిమిలి గ్రామాల్లో శ్రీరామరక్ష రథయాత్ర జరిగింది. భక్తుల కోలాటాలు, భజనలు, చిడతలు, తప్పెడుగుళ్లతో రథయాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో వి.దినబాబు, వర్మ, రవివర్మ, శివాజీ రాజాబహదూర్, పప్పు ఈశ్వరరావు, పడాల జగన్నాథరావు, మూర్తి, శ్రీను పాల్గొన్నారు.

లేఅవుట్లకు అన్ని అనుమతులు తప్పనిసరి

- **ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్**
- **'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన**


పాయకరావుపేటలోని పనులు జరుగుతున్న అక్రమ లేఅవుట్‌ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ

పాయకరావుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట పట్టణం, మండలంలోని గ్రామాల్లో వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలను లేఅవుట్లుగా అభివృద్ధి చేసేందుకు అన్ని అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ హెచ్చరించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'పేటలో అక్రమ లేఅవుట్లు' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు ఈవోపీఆర్‌డీ పట్టణ శివారులో కొత్తగా అభివృద్ధి చేస్తున్న లేఅవుట్‌ని పరిశీలించారు. వెంటనే పనులు నిలిపివేయాలని, అన్ని అనుమతులు తీసుకున్న తరువాతనే పనులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ శివారులో రెండు, రాజుగారిబీడులో ఒకచోట, మండలంలో పెదరాంభద్రపురంతోపాటు పలు గ్రామాల్లో కొత్తగా లేఅవుట్లు అభివృద్ధి చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. వీరంతా ల్యాండ్ కన్వర్షన్, లేఅవుట్ అభివృద్ధి కోసం పంచాయతీ, వీఎంఆర్‌డీఏ నుంచి అనుమతి తీసుకున్న తరువాతనే అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. లేకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గ్రంథాలయాలతో విజ్ఞానాన్ని పొందండి

- **గ్రంథాలయాధికారి ఎల్‌వీ.రమణ**


మునగపాక శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న బాలలు

మునగపాక, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులను వృథా చేయకుండా గ్రంథాలయాలకు విచ్చేసి విజ్ఞానాన్ని పొందాలని స్థానిక శాఖా గ్రంథాలయాధికారి ఎల్‌వీ.రమణ పిలుపునిచ్చారు. మునగపాక శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి శిక్షణ తరగతులు మొదలయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయట మార్కెట్‌లో లభ్యంకాని అనేక రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. విజ్ఞానం, వినోదంతోపాటు అనేక పుస్తకాలు ఉన్నాయని, వాటిని పఠనం చేయడం ద్వారా పరిజ్ఞానం పెరుగుతుందన్నారు.

పాయకరావుపేటలో..

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను ఎంఈవో కేఎస్.గాంధీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 11వ తేదీ వరకు నిర్వహించే ఈ వేసవి శిక్షణ తరగతుల్లో పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్స్, మ్యూజిక్, డ్యాన్సు, యోగా తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారన్నారు. తొలి రోజు హాజరైన 43 మందికి నీతి పద్యాలు, స్పోకెన్ ఇంగ్లీషు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్.సీతారామయ్య, వై.అచ్యుతరావు, తేజోమూర్తుల వెంకటేశ్వరరావు, యోగా గురువు ప్రసాద్, గ్రంథాలయం ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, ఎంపీపీ గోవింద్, తదితరులు

ఎలమంచిలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్ర దాడిని నిరసిస్తూ సోమవారం రాత్రి ఎలమంచిలిలో జర్నలిస్టులు కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు చేపట్టిన ఈ ర్యాలీకి మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, ఎంపీపీ బోదెపు గోవింద్, మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, మునిసిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరైపు గుప్తా, టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గొర్లె నానాజీ, ఆడారి రమణబాబు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ జర్నలిస్టులతో పాటు, పలువురు నేతలు, విశ్రాంత ఉద్యోగులు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

పాయకరావుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంఈఓ కేఎస్.గాంధీ తెలిపారు. ఐదు సంవత్సరాలు నిండి ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలోకి ఉచిత ప్రవేశానికి మే 2 నుంచి 19వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పునఃశ్చరణ, నమూనా పరీక్షలకు ప్రాధాన్యం

▸▸ పోటీ పరీక్షల అభ్యర్థులకు సివిల్స్ విజేత మానస సూచన



మానసను సత్కరిస్తున్న గౌరీ గ్రంథాలయం నిర్వాహకులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సంబంధ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు పునఃశ్చరణ, నమూనా పరీక్షలకే ప్రాధాన్యం ఇవ్వాలని సివిల్స్ విజేత రావాడ సాయి మోహిని మానస సూచించారు. పోటీ పరీక్షల శిక్షణ కేంద్రంగా ప్రసిద్ధి చెందిన స్థానిక గౌరీ గ్రంథాలయాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మానస మాట్లాడుతూ, తల్లిదండ్రుల ప్రేరణ, స్వయం శ్రద్ధ, ఒక ప్రణాళిక ప్రకారం చదివితే పోటీ పరీక్షల్లో తప్పనిసరిగా విజయం సాధించవచ్చన్నారు. పరీక్షల్లో సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, వేగంగా జవాబులు రాయడం కీలకమని, ఇందుకోసం రోజూ ఒకటి, రెండు ఆన్‌లైన్ నమూనా పరీక్షలు రాసి స్వీయ విశ్లేషణ చేసుకోవాలని సూచించారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్ష రాయాలని అన్నారు. పోటీ పరీక్షల్లో ఎక్కువ ప్రశ్నలు జ్ఞాపకశక్తి ఆధారితంగా ఉంటాయని, సహనం, పట్టుదల, ప్రణాళిక, సమయ సద్వినియోగంతో పోటీ పరీక్షల్లో విజేతలుగా నిలుస్తారని అభిప్రాయపడ్డారు. నైపుణ్యాన్ని పెంచుకుంటే విజయం కచ్చితమన్నారు. భాష కన్నా కంటెంట్ పైన ఎక్కువ దృష్టి పెట్టాలని మానస అన్నారు. గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ, భవిష్యత్తులో సివిల్స్‌కు శిక్షణ ఇవ్వడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలు కొణతాల పణిభూష జ్‌శ్రీధర్, కాండ్రేగుల సత్యనారాయణ, మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, కాండ్రేగుల జగ్గారావు, బొడ్డేడ జగ్గఅప్పారావు పాల్గొన్నారు.

2 నుంచి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్‌ల ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవీప్రసాద్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్‌లకు కనీస వేతనాలు అమలు చేయాలన్న డిమాండ్‌తో మే రెండో తేదీ నుంచి ఉద్యమానికి సిద్ధం కావాలని 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపునిచ్చింది. ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి విశాఖ జిల్లా యూనియన్ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవీప్రసాద్ మాట్లాడుతూ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్‌లకు పదేళ్లుగా కనీస వేతనాలు లేవని పేర్కొన్నారు. ఉద్యోగ భద్రత వంటి సమస్యల పరిష్కారం కాకుండా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందు కోసం వచ్చేనెల రెండో తేదీ నుంచి పోరాటానికి సిద్ధం కావాలని యూనియన్ సభ్యులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా అరబిందో కంపెనీ నిర్వహిస్తున్న ఈ వాహనాలు మే నెల చివరికి కాంట్రాక్టు ముగుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త కాంట్రాక్టర్‌కు ఇవ్వనున్న నేపథ్యంలో వచ్చే వారైనా కనీస వేతనాలు, ఉద్యోగభద్రత వంటి చర్యలు తీసుకోవాలని డిమాండ్లతో పోరాటానికి సిద్ధమవుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, యూనియన్ నాయకులు నర్సింగరావు, శ్రీను, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

లంకెలపాలెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెంలో మరిమాంబ ఉత్సవాలను పురస్కరించుకొని ఆర్కే రాయల్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడ ఉత్తరాంధ్ర స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి పోటీలు యువత మధ్య స్నేహభావం పెంపొందిస్తుందన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ వచ్చే నెల 14వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు నగదుతో పాటు జ్ఞాపికలను అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కర్రి అప్పారావు, సర్వసిద్ధి సన్యాసిరాజు, మంత్రి గిరిప్రసాద్, రౌతు మూర్తి, చిట్టిబోయిన కోటేశ్వరరావు, గుర్రం నాయుడు, కర్రి నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై 'ఏఎంఏఎల్' విద్యార్థుల నిరసన ర్యాలీ



కొత్తూరు కాలేజీ కూడలిలో మానవహారం చేస్తున్న విద్యార్థులు

కొత్తూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జమ్మూ కశ్మీర్‌లోని పెహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడిని ఖండిస్తూ ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు మాట్లాడుతూ ప్రపంచానికే పెను ముప్పుగా మారిన ఉగ్రవాదాన్ని అణచి వేయాలన్నారు. ఉగ్రవాద దాడి మృతులకు సం తాపం తెలిపారు. కళాశాల అధ్యాపక బృందం, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలీసెట్ విద్యార్థులకు ముగిసిన శిక్షణ తరగతులు



మాక్ టెస్టులో ప్రతిభావంతులకు బహుమతుల ప్రదానం

కశింకోట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి రాజీవ్ గాంధీ ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో గత నెల రోజులుగా పాలీసెట్‌కు హాజరు కానున్న విద్యార్థులకు జరుగుతున్న శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన మాక్‌టెస్టులో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఉమాశంకర్, అధ్యాపకులు ఎస్.గణేశ్, వీరేంద్ర, మదీనా, సురేష్, రమణకుమార్, జగన్మోహిని తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం

▸▸ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఆర్‌వో సత్యనారాయణరావు, ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజల నుంచి అందే అర్జీ లకు వారిలో సంతృప్తిస్థాయి పెరిగేలా పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమా వేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తే మరింత మంది ప్రజలు ఉత్సాహంగా విచ్చేసి అర్జీలను సమర్పించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఎస్‌డీసీలు ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, మనోరమ, జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాస్‌లతో కలిసి అర్జీలను స్వీకరించారు. పలువురితో స్వయంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. 257 మంది విచ్చేసి అర్జీలు అందజేసినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్‌వో సత్యనారాయణరావు



పోలీస్ కార్యాలయంలో అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

జిల్లా పోలీస్ కార్యాలయంలో...

ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ తుహిన్ సిన్హా అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పలువురితో స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. చట్ట పరిధిలో ఉన్న ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులకు ఆయన ఆదేశించారు. . ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి 30 మంది విచ్చేసి అర్జీలను సమర్పించారు. వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి వాటికి సంబంధించి అధికంగా అర్జీలు ఉన్నాయని జిల్లా పోలీస్ కార్యాలయం ఎస్ఐ జి.వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ (అడ్మిన్) దేవప్రసాద్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

లైంగిక దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి

▸▸ కలెక్టరేట్ ఎదుట ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన బాధితురాలు ఆందోళన

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతాపురంలోని షోర్ టూ షోర్ పరిశ్రమలో తాను పనిచేస్తున్న సమయంలో తనపై లైంగిక దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన మహిళ డిమాండ్ చేశారు. ఇక్కడి కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2018వ సంవత్సరంలో షోర్ టూ షోర్ బ్రాండ్ ప్యాకింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో సీనియర్ అడ్మిన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశానన్నారు. ఆ సమయంలో ఇదే కంపెనీలో పనిచేసిన ఏడుగురు వ్యక్తులు తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఆమె ఆరోపించారు. వీరిలో ఇద్దరిని మాత్రమే అరెస్టు చేసి, మిగిలిన వారిపై చర్యలు తీసుకోకుండా పోలీసులు విడిచిపెట్టారని చెప్పారు. ఈ అన్యాయాన్ని కోర్టు దృష్టికి తీసుకువెళ్లడంతో రూ.30 లక్షలు నష్టపరిహారాన్ని చెల్లించాలని నిందితులకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. రూ.మూడు లక్షలు మాత్రమే అందజేసి మిగిలిన సొమ్మును ఎగ్గొట్టారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాల మేరకు తనకు రావాల్సిన మిగిలిన నష్టపరిహారాన్ని అందజేయాలని, మిగిలిన నిందితులను అరెస్టు చేయాలని కోరారు.

'ప్రభుత్వ స్థలంలో అక్రమంగా రోడ్డు నిర్మాణం'

తుమ్మపాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం బవులువాడ పంచాయతీ రావుగోపాలరావు కాలనీ సర్వే నంబర్లు 70, 74, 75లలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి, అనుమతులు లేకుండా రోడ్డు నిర్మాణం చేపడుతున్న మైనింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం గ్రామ నాయకులు కె.బుజ్జి, పప్పల ఈశ్వరరావు తదితరులు ఫిర్యాదు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బవులవాడ పంచాయతీలో వ్యాపారాలు కొనసాగిస్తున్న కొంతమంది క్వారీ యజమానులు తమ వ్యాపార లావాదేవీలు సాగించుకోవడం కోసం ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కొండను సైతం చిన్నాభిన్నం చేస్తూ అనుమతులు లేకుండా రోడ్డు వేస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల పర్యావరణానికి ముప్పుతో పాటు కాలనీ గుండా క్వారీ లారీలు రాకపోకలు సాగిస్తే ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాల్సిందిగా విన్నవించారు.

అన్నదాతల కోసం అద్భుత యంత్రం

▸▸ కొత్తూరు నరసింగరావుపేట పోర్టు కాలనీకి చెందిన దుర్గాప్రసాద్ చక్కని ప్రయోగం

▸▸ రూ.లక్ష వచ్చించి.., నాలుగు రోజులు శ్రమించి డ్రోన్ తయారీ

▸▸ గ్రామస్థుల సమక్షంలో ఆవిష్కరణ.. రైతుల చెంతకు తీసుకు వెళ్లేందుకు ప్రయత్నం



అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : పొలాల్లో రైతులు పడుతున్న కష్టాన్ని కళ్లారా చూసిన ఓ యువకుడు వారికి ఉపయోగపడేలా ఓ పరికరాన్ని రూపొందించాడు. భవిష్యత్తులో దీని ద్వారా వారికి వెన్నుదన్నుగా నిలవాలన్న సంకల్పంతో ఉన్నాడు. ఇందుకు సంబంధించిన వివరాలివి. మండలంలోని కొత్తూరు నరసింగరావుపేట పోర్టు కాలనీకి చెందిన 20 ఏళ్ల యువకుడు అప్పికొండ దుర్గాప్రసాద్ పదో తరగతి పూర్తవ్వగానే నాగార్జున యూనివర్సిటీలో చేరి అగ్రికల్చర్ డిప్లమో పూర్తి చేశాడు. అనంతరం అనకాపల్లి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ విభాగంలో చేరాడు. ప్రస్తుతం తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి శివ విద్యుత్ సంస్థలో ఉద్యోగి. తల్లి సంతోషిమాత గృహిణి. దుర్గాప్రసాద్ తొమ్మిదో తరగతి చదువుతున్న వయస్సులోనే రైతులకు ఉపయోగపడే విధంగా ఏదో ఒకటి చేయాలని సంకల్పించాడు. ఇందులో భాగంగానే డ్రోన్ తయారీ వైపు అడుగులు వేశాడు. ఇందుకోసం ఈ రంగంలో నిష్ణాతుల వద్దకు వెళ్లి అవగాహన పెంచుకున్నాడు. సుమారు లక్ష రూపాయలు వెచ్చించి మూడు కేజీల బరువు ఉన్న డ్రోన్‌ను ఏడాది క్రితం తయారు చేశాడు. తొలుత దీనికి సంబంధించిన పరికరాలను తెప్పించాడు. సుమారు నాలుగు రోజులపాటు శ్రమించి చిన్న డ్రోన్‌ను తయారు చేశాడు. అనంతరం ఏడాది పాటు దీని పనితీరు తదితరాలను పరిశోధించాడు. సోమవారం కుటుంబ సభ్యులు, గ్రామస్థుల మధ్య ఆవిష్కరించాడు. ఇది కేవలం పదిహేను నిమిషాల్లో 20 నుంచి 30 సెంట్ల పొలంలో మూడు లీటర్ల పురుగుల మందును పిచికారీ చేస్తుంది. దీనికి కెమెరాను కూడా అమర్చాడు. దీని సహాయంతో ఈ యంత్రం పొలాల్లో మందును ఎలా పిచికారీ చేస్తుందో పరిశీలించవచ్చు. ఈ పరికరాన్ని రైతుల వద్ద ఏ విధంగా తీసుకు వెళ్లాలి అన్న అంశాన్ని అధికారులు, రాష్ట్ర డ్రోన్ అసోసియేషన్ దృష్టికి తీసుకు వెళ్లనున్నట్టు చెప్పాడు.



డ్రోన్‌ను తయారు చేసిన అప్పికొండ దుర్గాప్రసాద్

2న పరవాడ మండల సమావేశం

పరవాడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల రెండో తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో జరగనున్న ఈ సమావేశానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు విధిగా పాల్గొనాల్సిందిగా ఎంపీడీవో కె.ధర్మారావు కోరారు.

సీసీ కాలువ నిర్మాణానికి శంకుస్థాపన

పరవాడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ సినిమాహాల్ జంక్షన్‌లో సీసీ కాలువ నిర్మాణానికి సోమవారం సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ పైలా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. మండల పరిషత్ నిధులు రూ.పది లక్షలతో ఈ పనులను చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైలా రామచంద్రరావు, బొద్దపు అయ్యబాబు, రెడ్డి నాగేశ్, బద్రి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక దినోత్సవం పోస్టర్లు ఆవిష్కరణ

పరవాడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను కార్మికులంతా విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఇక్కడ ఆవిష్కరించి మాట్లాడారు. మండలంలో 25 చోట్ల ఈ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ టీయూ నాయకులు వి.వి.రమణ, ఎం.సంతోశ్‌కుమార్, వై.బాబూరావు, ఆర్.శంకరరావు, పెంటారావు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.



మేయర్‌ను సత్కరిస్తున్న మాజీ మంత్రి దాడి, పీలా

మేయర్‌కు నేతల సత్కారం

అనకాపల్లి టౌన్/పరవాడ/ సబ్బవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావును మాజీ మంత్రి దాడి వీరభద్రరావు సోమవారం విశాఖలో కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ నాయకులు పోలారపు త్రినాథ్, బొద్దపు ప్రసాద్, టీడీపీ అనకాపల్లి పట్టణశాఖ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేశ్ తదితరులు కలిసి సత్కరించారు. అలాగే, పరవాడ మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాదంశెట్టి నీలబాబు తదితరులు మేయర్‌గా ఎన్నికైన శ్రీనువాసరావును సత్కరించారు. టీడీపీ నాయకులు వియ్యపు చిన్న, సాలాపు మోహన్, కూండ్రపు శ్రీరామ్మూర్తి, వర్రి వసంతరావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మేయర్‌గా ఎన్నికైన శ్రీనివాసరావును సబ్బవరం మండలానికి చెందిన టీడీపీ జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు పీబీవీఎస్ఎన్ రాజు, మాజీ ఎంపీపీ గండి దేముడు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోరాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మేయర్‌ను అభినందిస్తున్న మళ్ల సురేంద్ర

ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

కశింకోట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మహిళలు కుట్టు మిషన్ ద్వారా శిక్షణ పొంది తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచించారు. మండలంలోని సోమవరం గ్రామంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలోని మహిళలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం మహిళల కుటుంబ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే తల్లిదండ్రులంతా ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించి నాణ్యమైన విద్యనందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఉగ్గిన రమణమూర్తి, వేగి గోపీకృష్ణ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, ఉల్లింగల రమేష్, వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, తదితరులు

'టీడీపీ మరింత బలోపేతం కావాలి'

తుమ్మపాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : టీడీపీని గ్రామ గ్రామాన మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలంతా కృషిచేయాలని ఆ పార్టీ అనకాపల్లి పట్టణ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు సూచించారు. మండలంలోని మార్టూరు, ఊడేరు, మామిడిపాలెం గ్రామాల్లో టీడీపీ సంస్థాగత ఎన్నికలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం కొత్తగా ఎన్నికైన వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, నాయకులు కర్రి బాబి, బొలిశెట్టి శ్రీనివాసరావు, చెక్కల శ్రీను, రమేష్, సైనిక్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఊడేరులో ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్నికైన సభ్యులు



కశింకోటలో తరగతులు ప్రారంభిస్తున్న వెటర్నరీ అధికారిణి కరుణశ్రీ

కశింకోట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. వెటర్నరీ ఆసుపత్రి జూనియర్ వెటర్నరీ అధి కారిణి సిహెచ్.కరుణశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఇటువంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల సందర్శనను అలవర్చుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని వివరించారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, వివిధ రకాల పత్రికలు ఇక్కడ లభ్యమవుతాయన్నారు. వీటిని చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. గాయిత్రి పాఠశాల ఉపాధ్యాయులు సిహెచ్.శాంతి, జె.అశ్విని, గ్రంథాలయాధికారి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం



సబ్బవరం శాఖా గ్రంథాలయంలో...

సబ్బవరం : విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించేందుకు వేసవి శిక్షణ శిబిరాలు దోహదపడతాయని మేజర్ పంచాయతీ సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు అన్నారు. ఇక్కడి శాఖా గ్రంథాలయంలో ఈ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఎంఈవో రవీం ద్రబాబు మాట్లాడుతూ జూన్ ఐదో తేదీ వరకు ఈ తరగతులు కొనసాగుతాయన్నారు. రిటైర్డ్ వ్యవసాయాధికారి రత్నకుమార్, గ్రంథాల యాధికారిణి వి. శిరీష, వార్డు సభ్యులు కొల్లి కృష్ణతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ముందే విరబూసిన మే ఫ్లవర్స్


కుమ్మరవీధిలో విరబూసిన మే ఫ్లవర్స్

చింతపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): చింతపల్లిలో మే ఫ్లవర్స్ ముందుగానే కనువిందు చేస్తున్నాయి. స్థానిక కుమ్మరవీధిలో ఉపాధ్యాయుడు సంపరి ప్రేమసాగర్ పెరటిలో మే ఫ్లవర్స్ విరబూశాయి. సాధారణంగా మే మొదటి వారం నుంచి మే ఫ్లవర్స్ కనిపిస్తుంటాయి. ఏడాదికి ఒకసారి కనిపించే ఈ పుష్పాలు నెల రోజుల పాటు వాడిపోకుండా ఆకర్షణీయంగా దర్శనమిస్తాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో వర్షాలు విస్తారంగా కురవడంతో ముందుగానే ఈ ఫ్లవర్స్ విరబూశాయి. వీటిని తిలకించేందుకు స్థానికులు తరలివస్తున్నారు.

గిరిజన ప్రాంతంలో టీడీపీకి పూర్వ వైభవం

▸▸ టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ముక్కలి మహేశ్

గూడెంకొత్తవీధి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో టీడీపీకి పూర్వవైభవం వచ్చిందని టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు ముక్కలి మహేశ్ అన్నారు. సోమవారం మండలంలోని పి.కొత్తూరు గ్రామంలో ఆదివాసీలకు పార్టీ సభ్యత్వ కార్డులను అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజనులు అధిక సంఖ్యలో పార్టీ సభ్యత్వాలు తీసుకున్నారన్నారు. పాడేరు నియోజకవర్గంలో టీడీపీ బలపడిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక స్థానాలను పార్టీ అభ్యర్థులు సొంతం చేసుకుంటారన్నారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు వండలం బాలయ్య, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు గుంట బుజ్జిబాబు, బూత్ కన్వీనర్ చిన్నబాబు పాల్గొన్నారు.

'30న ఐటీడీఏ ముట్టడికి తరలిరావాలి'

జి.మాడుగుల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు నూరు శాతం ఉద్యోగాల రిజర్వేషన్ కల్పించాలని ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ మండల కో-కన్వీనర్ ఎం.నారాయణరాజు డిమాండ్ చేశారు. సోమవారం గిరిజన డీఎస్సీ అభ్యర్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీతో గిరిజన అభ్యర్థులకు తీవ్ర నష్టామని ఆవేదన చెందారు. ఈనెల 30న పాడేరు ఐటీడీఏ ముట్టడి కార్యక్రమానికి నిరుద్యోగులంతా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో బీఈడీ, డీఈడీ అభ్యర్థులు మత్స్యరాజు, ఉమామహేశ్, నాగేంద్ర, గణేశ్, కామేశ్ పాండు పాల్గొన్నారు.

ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి


విలేకర్లతో మాట్లాడుతున్న రాజశేఖర్

పాడేరురూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీలకు 100 శాతం రిజర్వేషన్ నియామక ఆర్డినెన్స్ జారీ చేసి, స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీతో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. మే 2వ తేదీన గిరిజన, విద్యార్థి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న మన్యం బంద్ విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికల ముందు అరకు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వి.కృష్ణ, బాలు, జగదీష్, చిన్నబాబు పాల్గొన్నారు.

సిద్దిలింగేశ్వరస్వామి ఆలయానికి మోదకొండమ్మ ఉత్సవ విగ్రహం వితరణ


మోదకొండమ్మ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం

పాడేరురూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మినుములూరు పంచాయతీ సంగోడి గ్రామంలో కొలువైన సిద్ధిలింగేశ్వర స్వామి ఆలయానికి మోదకొండమ్మ పంచలోహాల ఉత్సవ విగ్రహాన్ని మోదకిరణ్ మణికంఠ అన్నదాన ట్రస్టు చైర్మన్ శివరాత్రి శ్రీనివాస్ కుమార్ బహూకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు సాయిప్రశాంత్ శర్మ ప్రత్యేక పూజలు చేసి మోదకొండమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో స్థానిక ఉమానీలకంఠేశ్వరస్వామివారి సమేత రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలం నాయుడు, రమాదేవి దంపతులు, పాడేరు మోదకొండమ్మ ఆలయ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు, బోనంగి రమణ,బీవీఎస్.ముకుందరావు, పెనురెడ్డి దేముడు, తమర్బ ప్రసాదరావు, ఉప్పల వెంకటరత్నం, రామకృష్ణ బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు, సంగోడి పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

▸▸ అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం


భీంపోల్‌లులో భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

అనంతగిరి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నాన్ షెడ్యూల్డ్ పంచాయతీలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైతే చూస్తూ ఊరుకునేది లేదని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం హెచ్చరించారు. మండలంలోని బీంపోలు పంచాయతీలో సోమవారం ఆయన పర్యటించారు. ప్రభుత్వ భూమి ఆక్రమణపై ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో పరిశీలించారు. అనంతరం సచివాలయం వద్ద సమావేశమయ్యారు. స్థానిక గిరిజనుల నుంచి భూ సమస్యలపై పలు వినతులను స్వీకరించారు. చట్టాలకు అతిక్రమిస్తే సహించేది లేదని, గిరిజనులకు అన్యాయం జరిగితే పరిస్థితులు వేరుగా ఉంటాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, వైసీపీ మండల అధ్యక్షుడు సూర్యనారయణ, ఎంపీటీసీ సభ్యులు అశోక్, తౌటినాయుడు, సర్పంచ్ అప్పారావు, నాయకులు స్వామి, మహేశ్ పాల్గొన్నారు.

చినుకు పడితే రెండు మండలాల్లో చీకటే

▸▸ జీకేవీధి, చింతపల్లి మండలాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం.. ▸▸ ప్రత్యామ్నాయంపై దృష్టిసారించని ఈపీడీసీఎల్ అధికారులు

చింతపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్ పరిధిలోని గిరిజన గ్రామాలు చినుకుపడితే అంధకారంలో మగ్గాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. చింతపల్లి, నర్సీపట్నం ప్రాంతాల్లో ఎక్కడైనా వర్షం పడితే చింతపల్లి, జీకేవీధి మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతున్నది. సాంకేతిక సమస్యను పరిష్కరించే వరకు ప్రాంతీయ ప్రజలు గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. చింతపల్లి, జీకేవీధి మండలాలకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా చేసేందుకు ఈపీడీసీఎల్ అధికారులు దృష్టిసారించకపోవడం వల్ల విద్యుత్ కష్టాలు పెరిగిపోయాయి. సోమవారం నర్సీపట్నంలో వర్షం పడడంతో సాంకేతిక సమస్య ఏర్పడి మధ్యాహ్నం మూడు గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రాంతీయులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సివచ్చింది. చింతపల్లి, జీకేవీధి మండలాలకు నర్సీపట్నం మీదుగా కొరుప్రోలు 133 కేవీ ఉప కేంద్రం నుంచి విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఈ రెండు మండలాలకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా చేసే లైన్ అందుబాటులోలేదు. దీంతో కొరుప్రోలు నుంచి చింతపల్లి వరకు ఎక్కడ సాంకేతిక సమస్య తలెత్తినా ఈ రెండు మండలాల ప్రజలకు అంధకారం తప్పడంలేదు. నర్సీపట్నం ప్రాంతంలో వర్షంతో సాంకేతిక సమస్య తలెత్తితే పట్టణ ప్రాంతాలకు తొలుత విద్యుత్ సరఫరా పునరుద్ధరించి, ఆలస్యంగా గిరిజన ప్రాంతానికి సరఫరా చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీలేరు, పాడేరు ప్రాంతాల నుంచి ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ నిర్మిస్తామన్న ప్రకటనలు గాలిలో కలిసిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీలేరు ఏపీ ట్రాన్స్‌కో నుంచి ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ నిర్మాణానికి నిధులు విడుదల చేసి నెలలు గడిచిపోతున్నప్పటికీ పనులు ప్రారంభించడంలో ఈపీడీసీఎల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో జీకేవీధి, చింతపల్లి ప్రజలకు విద్యుత్ అంతరాయం తప్పడంలేదు. ఇప్పటికైన ఈపీడీసీఎల్ అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ విద్యుత్‌లైన్ వేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రాంతీయులు కోరుతున్నారు.

గ్రామ కమిటీలతోనే తెలుగుదేశం పార్టీ బలోపేతం : గిడ్డి ఈశ్వరి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

పాడేరురూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ కమిటీలతోనే తెలుగుదేశం పార్టీ బలోపేతం అవుతుందని ఆ పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. కుమ్మరిపుట్టులోని ఆమె నివాసగృహంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేసే ప్రతి ఒక్కరికీ పార్టీ గుర్తిస్తుందన్నారు. ప్రజలకు సేవ చేసే భాగ్యం గ్రామ కమిటీల ద్వారానే లభిస్తుందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గతంలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ గెలిచినా దాని ప్రభావం మన్యంలో లేదన్నారు. ప్రజలంతా తెలుగుదేశం పార్టీ అభివృద్ధి, సంక్షేమ పథకాల వైపే చూస్తున్నారన్నారు. భవిష్యత్‌లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించే దిశగా కమిటీలు కృషి చేయాలన్నారు. ప్రతీ గ్రామంలోనూ రెండు రోజుల్లో క్లస్టర్ ఇన్‌చార్జిల నియామకం పూర్తి చేయాలన్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే గ్రామ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ప్రధాని మోదీ సభను విజయవంతం చేద్దాం

అమరావతి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు మే 2వ తేదీన భారత ప్రధాని నరేంద్రమోదీ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి కోరారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి ప్రధాని సభకు తరలివెళ్లేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బొర్రా విజయరాణి, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పి.గోవిందరావు, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు డప్పోడి వెంకటరమణ, అరకు పార్లమెంట్ నియోజకవర్గ సభ్యురాలు డిప్పల వెంకటకుమారి, పార్లమెంట్ మహిళా అధికార ప్రతినిధి అల్లంగి సుబ్బలక్ష్మి, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి మండల పార్టీ అధ్యక్షులు కూడి రామునాయుడు, వంతాల కొండలరావు, కిల్లో పూర్ణచందరరావు పాల్గొన్నారు.

దేశీయ విత్తనాలను కాపాడుకుందాం

▸▸ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు



దేశీయ విత్తనాలను పరిశీలిస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు

చింతపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):దేశీయ విత్తనాలను కాపాడుకుందామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు పిలుపునిచ్చారు. సోమవారం సిఫా, వాసన్, ఆర్ఆర్ఏఎన్ సంస్థలు లంబసింగిలో అంతర్జాతీయ ఆదిమ విత్తనాల పండుగను నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్టీ కమిషన్ చైర్మన్, వివిధ సంస్థల ప్రతినిధులు తొలుత వృక్షానికి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శంకరరావు మాట్లాడుతూ ఆదిమ విత్తన సంపత్తిని కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు ఆస్తిగా అందజేయాలన్నారు. లంబసింగి పంచాయతీ పరిధిలో 12గ్రామాల్లో భారత దేశీయ విత్తనాల గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. విత్తన గ్రామాలను అభివృద్ధి చేయడంతో పాటు ప్రకృతి ఆధారిత పంటలను గిరిజన రైతులు సాగు చేసేందుకు ప్రోత్సహించాలన్నారు. ఏయూ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ రాజు మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల నుంచి విత్తనాలు సేకరించి ఈ ప్రాంతంలో నాట్లు వేయించడం గొప్ప విషమన్నారు. గిరిజన రైతులు ఇబ్రీడ్ విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగుమందులకు ఆకర్షితులు కాకుండా చైతన్యవంతులను చేయాలన్నారు. ఈ సందర్భంగా సిఫా సేకరించిన 500 దేశీయ విత్తనాలను ఎస్టీ కమిషన్ చైర్మన్ పరిశీలించి, సంస్థ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ప్రాంతీయ సమన్వయకర్త జానకిరావు, నీతి అయోగ్ ప్రతినిధులు నారాయణరెడ్డి, చైతన్యరెడ్డి, సిఫా సంస్థ సీఈవో డాక్టర్ శశిప్రభ, వాసన్ అసోసియేట్ డైరెక్టర్ సన్యాసిరావు, హీఫర్ ఇంటర్నేషనల్ పీవో డాక్టర్ సునీత, ఆర్ఆర్ఏ నెట్వర్కు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎం. లీలావతి, గ్రీన్‌క్లైమేట్ టీం ప్రతినిధి జేవీ రత్నం, సంజీవని సంస్థ ప్రతినిధి దేముళ్లు పాల్గొన్నారు.

క్రీడల్లో యువత రాణించాలి

▸▸ ఆదివాసీ ట్రస్టు చైర్మన్ కోరాబు బాలం పడాల్

▸▸ ముత్యాలమ్మ షటిల్ కప్ విజేత భీమిలి


విజేతలకు జ్ఞాపిక అందజేస్తున్న ఆదివాసీ ట్రస్టు చైర్మన్ బాలం పడాల్

చింతపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి):యువత క్రీడల్లో రాణించాలని ఆదివాసీ ట్రస్టు చైర్మన్ కోరాబు బాలంనాయుడు అన్నారు. సోమవారం వేకువజామున జెడ్పీ స్కూల్ వేదిక వద్ద ముత్యాలమ్మ షటిల్ కప్ విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 79 జట్లు హాజరుకాగా ప్రథమ స్థానం భీమిలి, ద్వితీయ స్థానం లంబసింగి క్రీడాకారులు సొంతం చేసుకున్నారు. ప్రథమ స్థానం క్రీడాకారులకు ఆదివాసీ ట్రస్టు చైర్మన్ రూ.25వేల నగదు, జ్ఞాపికను అందజేశారు. ద్వితీయ స్థానం క్రీడాకారులకు ఎంపీపీ కోరాబు అనుషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య ఆర్థిక సహకారంతో రూ.15వేల నగదు, జ్ఞాపికను అందజేశారు. ఈసందర్భంగా ఆదివాసీ ట్రస్టు చైర్మన్ మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉపాధి, ఉద్యోగ అవకాశాల్లో ప్రత్యేక రిజర్వేషన్ పొందవచ్చునన్నారు. అనంతరం ఆదివాసీ ట్రస్టు చైర్మన్‌ని ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పసుపులేటి లక్ష్మణరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దురియా హేమంత్ కుమార్, ప్రధాన కార్యదర్శి పసుపులేటి వినాయకరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, క్రీడల నిర్వాహకులు ఏఈ కిముడు జ్యోతిబావు, తారక్, నాగేశ్వరరావు, రాము పాల్గొన్నారు.

డోలీ మోతలు.. గిరిజనుల అగచాట్లు


అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని డోలీ సహాయంతో తీసుకువెళ్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పాలక ప్రభుత్వాలు మారుతున్నా గిరిజనులకు డోలీ మోతలు తప్పడంలేదు. ఏ చిన్నపాటి ఆరోగ్య సమస్య తలెత్తినా డోలీ ఎక్కాల్సిన దుస్థితి దాపురిస్తున్నది. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని అత్యంత మారుమూల రంగబయలు పంచాయతీ గొబ్బరిపడ గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేదు. ఆ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఐదుగురు గిరిజనులను సోమవారం డోలీ సహాయంతో సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో గల రహదారి ఉన్న రంగబయలు గ్రామానికి తీసుకువచ్చారు. అక్కడ నుంచి ప్రైవేటు వాహనంలో లబ్బూరు సీహెచ్‌సీకి తరలించారు. తమ గ్రామానికి పక్కా రహదారి సౌకర్యం కల్పించాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. రహదారి సౌకర్యం లేకపోవడం వలన ఏ చిన్నపాటి అవసరానికైనా కాళ్లకు పని చెప్పాల్సి వస్తుందని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాధుల బారిన పడితే ఆస్పత్రులకు వెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నామని వాపోయారు.

ఉత్తరాంధ్ర స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

లంకెలపాలెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెంలో మరిమాంబ ఉత్సవాలను పురస్కరించుకొని ఆర్కే రాయల్ యూత్ ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడ ఉత్తరాంధ్ర స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి పోటీలు యువత మధ్య స్నేహభావం పెంపొందిస్తుందన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ వచ్చే నెల 14వ తేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు నగదుతో పాటు జ్ఞాపికలను అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కర్రి అప్పారావు, సర్వసిద్ధి సన్యాసిరాజు, మంత్రి గిరిప్రసాద్, రౌతు మూర్తి, చిట్టిబోయిన కోటేశ్వరరావు, గుర్రం నాయుడు, కర్రి నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతాపురంలోని షోర్ టూ షోర్ పరిశ్రమలో తాను పనిచేస్తున్న సమయంలో తనపై లైంగిక దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన మహిళ డిమాండ్ చేశారు. ఇక్కడి కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2018వ సంవత్సరంలో షోర్ టూ షోర్ బ్రాండ్ ప్యాకింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో సీనియర్ అడ్మిన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశానన్నారు. ఆ సమయంలో ఇదే కంపెనీలో పనిచేసిన ఏడుగురు వ్యక్తులు తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని ఆమె ఆరోపించారు. వీరిలో ఇద్దరిని మాత్రమే అరెస్టు చేసి, మిగిలిన వారిపై చర్యలు తీసుకోకుండా పోలీసులు విడిచిపెట్టారని చెప్పారు. ఈ అన్యాయాన్ని కోర్టు దృష్టికి తీసుకు వెళ్లడంతో రూ.30 లక్షలు నష్టపరిహారాన్ని చెల్లించాలని నిందితులకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. రూ.మూడు లక్షలు మాత్రమే అందజేసి మిగిలిన సొమ్మును ఎగ్గొట్టారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాల మేరకు తనకు రావాల్సిన మిగిలిన నష్టపరిహారాన్ని అందజేయాలని కోరారు.

రాంపుట్టులో వ్యాన్ బోల్తా

▸▸ తప్పిన పెను ప్రమాదం

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో దోడిపుట్టు పంచాయతీ పరిధిలోని రాంపుట్టు సమీపంలో సోమవారం పనసకాయల లోడుతో వెళ్తున్న వ్యాన్ బోల్తా పడింది. ఆంధ్రా నుంచి ఒడిశాకు పనసకాయల లోడుతో వెలుతుండగా మార్గమధ్యంలోని ఘాట్ ఎక్కుతుండగా వ్యాన్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఆ సమయంలో వ్యాన్‌లో సుమారు ఏడుగురు ఉన్నారు. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. దీంతో పెను ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


పనసకాయల లోడుతో వ్యాన్ బోల్తాపడిన దృశ్యం

డీఎస్సీ నోటిఫికేషన్ నిలుపు చేయాలి

▸▸ కలెక్టర్‌కు స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న డీఎస్సీ సాధన కమిటీ సభ్యులు

పాడేరురూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా డీఎస్సీ నోటిఫికేషన్ నిలుపుదల చేయాలని, మే 2 నుంచి చేపడుతున్న మన్యం బంద్‌కు సహకరించాలని కోరుతూ ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ సభ్యులు సోమవారం జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ 20వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీతో ఆదివాసీ నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. 5వ షెడ్యూల్ ఏరియాలో 100 శాతం రిజర్వేషన్ అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడం వల్ల ఆదివాసీ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ సభ్యులు పి.అప్పలనర్స, కుడుముల కాంతారావు, వల్ల వెంకటరమణ, కె.కోటిబాబు, కె.సుబ్రహ్మణ్యం, కె.రాధాకృష్ణ, వి.నాగేశ్వరరావు, వి.దాస్, శెట్టి నాడరాజు, సింహాద్రి, వై.కుమార్, డి.శంకర్, పి.రాధ, ఆర్.ప్రశాంతకుమార్, ఎం.చిరంజీవి, కె.చిన్నారి, పి.నరేష్ పాల్గొన్నారు.

చింతపల్లిలో వర్షం

చింతపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. సోమవారం రాత్రి ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు వర్షం పండింది. వర్షం వల్ల ప్రధాన రహదారులపైకి వరద చేరుకున్నది. లోతట్టు ప్రాంతాలకు వర్షపు నీరు చేరుకున్నది. ముత్యాలమ్మ జాతర నాలుగు రోజులు వర్షం పడకపోవడం, సోమవారం వర్షం పడడంతో ప్రాంతీయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎంఎల్‌హెచ్‌పీలు సమ్మె ప్రారంభం


వైద్యాధికారికి సమ్మె నోటీసు ఇస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు

కొయ్యూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో మండలంలోని మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవెడర్లు సోమవారం నుంచి సమ్మెకు దిగారు. ఈ మేరకు రాజేంద్రపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారికి తమ డిమాండ్లతో సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. తమ సమస్యల పరిష్కారానికి ఈనెల 15వ తేదీ నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడంతో సమ్మెకు దిగినట్టు చెప్పారన్నారు. తమకు ఆయుష్మాన్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలు క్రమబద్ధీకరించాలని, క్లినిక్ అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మారెమ్మ చల్లనీటి ఉత్సవం


మారెమ్మ ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

సీలేరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : సీలేరు మారెమ్మ 53వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా సోమవారం చల్లనీటి ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగిస్తూ గ్రామంలో పసుపు నీరు చల్లారు. అనంతరం గరగను సీలేరు రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు. చల్లనీటి ఉత్సవం సందర్భంగా ఆలయం నుంచి తీసుకొచ్చే పసుపు నీటిని స్థానికులు తమ ఇంటికి తీసుకు వెళ్లి శుద్ధ చేసుకోవడం ఆనవాయితీ. చల్లనీటి ఉత్సవంతో మారెమ్మ అమ్మవారి ఉత్సవాలు ముగిశాయి.

జాములవీధిలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

జి.మాడుగుల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొయితిలి పంచాయతీ జాములవీధిలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని బీసీవై పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి కిలో రాజన్ కోరారు. స్థానికుల ఆహ్వానం మేరకు సోమవారం ఆయన గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రాజన్ మాట్లాడుతూ గ్రామంలో రహదారి లేక ఇక్కట్లు పడుతున్నారన్నారు. సుమారు 90 ఎకరాలు సాగు భూములకు చెక్‌డ్యామ్ లేక నీరు అందడం లేదన్నారు. అంతేకాకుండా తాగునీటి సమస్య, అంగన్‌వాడీ భవనం, సీసీ రోడ్డు సదుపాయాలు కల్పించాలని రాజన్ కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు టి.వెంకటరమణ, బుల్లిదొర, రామయ్య, సత్తిబాబు, గంగంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కుమడలో డ్రైనేజీలు నిర్మించరూ..


కుమడలోరహదారిపై నుంచి ప్రవహిస్తున్న నీరు

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల కుమడ పంచాయతీ కేంద్రంలో ప్రధాన రహదారి, వీధుల్లో గల సీసీ రోడ్ల ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రధాన జంక్షన్ రహదారి ఇరువైపులా డ్రైనేజీ సదుపాయం లేకపోవడం వలన కొలాయిల నుంచి వచ్చే నీరు, మురుగు నీరు రహదారిపైకి వచ్చేస్తుంది. దీంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పలు సందర్భాల్లో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మురుగు నీరు నిల్వ ఉండి పోవడంతో దుర్గంధం వెదజల్లుతుందని, దోమల ఉత్పత్తి ఎక్కువై పలు రకాల వ్యాధులు వ్యాపిస్తున్నాయని స్థానికులు వాపోయారు. డ్రైనేజీలు నిర్మించాలని అధికారులకు అందించినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు తిరుపతి, గున్నిపడాల్, ఆనందరావు, జగదీష్, రమేశ్ తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీలు నిర్మించాలని వారు కోరుతున్నారు.



కేజీబీవీ అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్

రూ.97 కోట్లతో అభివృద్ధి పనులు

- శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నియోకవర్గంలో రూ.97 కోట్ల అభివృద్ధి పనులు చేపడుతున్నామని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చెప్పారు. మండలంలోని భీమబోయినపాలెం కేజీబీవీ కళాశాలలో అదనపు తరగతుల భవనాలకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థినులు శతశాతం ఉత్తీర్ణత సాధించడం ప్రశంసనీయమన్నారు. మాకవరపాలెం మండలానికి ఇంతవరకు రూ.10.7 కోట్లు మంజూరు చేయగా, ఒక్క భీమబోయినపాలెం గ్రామానికి రూ.కోటి మంజూరు చేసినప్పటికీ కేజీబీవీ భవన నిర్మాణ పనులు పూర్తిచేశారని సర్పంచ్ రుత్తల నందకిశోర్‌ను అభినందించారు. అయితే జి.వెంకటాపురం, జి.కోడూరు, గిడుతూరు, లచ్చన్నపాలెం, తాడపాల, మామిడిపాలెం, ఎస్ఆర్‌పేట తదితర గ్రామాల్లో పనులు పెండింగు ఉన్నాయన్నారు. కేజీబీవీ రోడ్డుకు విద్యుత్ స్తంభాలు, పాఠశాలకు సోలార్ విద్యుత్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తామని స్పీకర్ ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి జీవోలు లేకుండా ఇక్కడ మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టి వృథాగా వదిలేశారని ఆరోపించారు. ఈ కళాశాల నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్రశిక్షా సమన్వయకర్త జయప్రకాశ్, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఎంఈవో మూర్తి, ఎస్ఎంసీ ఛైర్‌పర్సన్ సరోజిని, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, నాయకులు అల్లు రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి సమస్య పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



కోటవీధిలో బోరు తవ్వే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. సోమవారం పట్టణంలోని కోటవీధి, శివాలయంవీధి, గంది కాలనీల్లో నాలుగు బోర్ల తవ్వకాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో మంచినీటి పథకాలు సక్రమంగా పనిచేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్ నూకరత్నం, ఈవో నారాయణరావు, ఎంపీటీసీ సభ్యులు కొట్టాపు రూపదేవి, పాలెం నాయుడు. టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, పెదబాబు, కనిశెట్టి మత్స్యరాజు, దేవరపల్లి వెంకట అప్పారావు, సకురు కోటేశ్వరరావు, గంది మూర్తి, సంతోశ్, దివ్య, గూనూరు సురేష్, ఎలకా మల్లిబాబు, పప్పు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జమ్మిదేవమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే రాజు

రావికమతం: మండలంలోని టి.అర్జాపురం గ్రామ దేవత శ్రీజమ్మిదేవమ్మ పండగ సందర్భంగా ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు సోమవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని అందరితో కలసి దర్శించుకోవడం తనకు ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు, సర్పంచ్ మడగల ఫాల్గుణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బంటు శ్రీను పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించిన నాగాలాండ్ బృందం



ఏఎల్‌పురం కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాగలాండ్ బృందం ప్రతినిధులు

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురం, పప్పుశెట్టిపాలెం, జోగంపేట తదితర గ్రామాల్లో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను నాగాలాండ్ బృందం ప్రతినిధులు అమిలోహెంతాన్, హెకిలీయాఫ్ సోమవారం సందర్శించారు. కేంద్రాల్లో చిన్నారుల ఆటపాటలను తిలకించడంతో పాటు పనితీరు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించేందుకు ఈ బృందాన్ని పంపడంతో పాటు కేంద్రాల పనితీరుపై నివేదిక ఆధారంగా నగదు ప్రోత్సాహం ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఐసీడీఎస్ పీవో శ్రీగౌరీ, సూపర్‌వైజర్లు సత్యశ్రీ, లక్ష్మి పాల్గొన్నారు.

చింతపండుకు గిట్టుబాటు ధర



వారపు సంతలో విక్రయానికి తీసుకు వచ్చిన చింతపండు

మాడుగుల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన వారపు సంతలో చింతపండుకు గిట్టుబాటు ధర లభించింది. ఏజెన్సీలోని పులుసుమామిడి, కందులపాలెం, ఈదులపాలెం, వంట్లమామిడి, కక్కి, సలుగు, దేవాపురం, వంట్లమామిడి తదితర గ్రామాల గిరిజన రైతులు పండించిన చింతపండును సంతలో విక్రయానికి తీసుకురాగా, గత వారం కంటే ఎక్కువ ధర లభించింది. గత వారం 30 కిలోల బరువు గల కావిడి చింతపండు రూ.2,300కు అమ్ముడుకాగా, అదే కావిడి ఈ వారం రూ.2,800 ధరకు వెళ్లింది. అలాగే చింతబొట్టలు కావిడి గతవారం రూ.1600 కాగా, ఈ వారం రూ.1800కు పైగా ధర పలికింది. దీంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

భీమవరంలో రీ సర్వే చేయాలని వినతి

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమవరం గ్రామంలో డి.పట్టా, ప్రభుత్వ భూములను రీ సర్వే చేయాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం మలిరెడ్డి బుజ్జి, వి.అప్పలనాయుడు, గోవింద తదితరులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అర్.భీమవరంలోని అన్ని భూములను రీ సర్వే చేయాలని, మిగులు భూములను పేదలకు పంపిణీ చేయాలని కోరారు.

వారపు సంతలో ట్రాఫిక్ సమస్యకు చెక్

- రోడ్డుపై నుంచి దుకాణాలను మార్చిన అధికారులు
- యూనియన్, సెంట్రల్ బ్యాంకుల సమీపంలో సంత ఏర్పాటు
- వినియోగదారులు, ప్రయాణికులు, వాహన చోదకుల హర్షం

మాడుగుల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమ, గురువారాల్లో జరిగే వారపు సంతలో ఎట్టకేలకు ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించింది. పంచాయతీ పాలకవర్గం, పోలీసులు ఈ సమస్యకు చెక్ పెట్టారు. మాడుగుల-కోడూరు రోడ్డును ఆనుకుని వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేయడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకునే పరిస్థితి ఉండేది కాదు. ఈ క్రమంలో వాహనాలు ముందుకు కదలక భారీగా స్తంభించిపోయేవి. ట్రాఫిక్ సమస్య జఠిలం కావడంతో వ్యాపారులు, వినియోగదారులు, ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొనేవారు. సర్పంచ్ యడ్ల కళావతి, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు, పాలకవర్గ సభ్యులు, టీడీపీ నాయకులు ఈ సమస్యకు ఎలాగైనా చెక్ పెట్టాలని చర్చించుకున్నారు. ఈ మేరకు సంత మార్పు చేయాలని పాలకవర్గ సభ్యులు తీర్మానించారు. పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబుకు తీర్మాన పత్రం ఇచ్చిన అనంతరం ఎస్ఐ జి.నారాయణరావుతో మాట్లాడి దుకాణాలను రోడ్డుపై నుంచి వేరే ప్రదేశానికి తరలించారు. యూనియన్, సెంట్రల్ బ్యాంకుల పక్కన ఉన్న ఖాళీ స్థలంలో సంతను మార్పు చేశారు. దీంతో మాడుగుల-కోడూరు రహదారి క్లియర్ అయింది.



దుకాణాల మార్పుతో క్లియర్‌గా ఉన్న మాడుగుల-కోడూరు రోడ్డు... కొత్త స్థలంలో ఏర్పాటు చేసిన వారపు సంత

వాహనాల రాకపోకలకు అంతరాయం లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యకు చెక్ పడింది. అధికారులు, పంచాయతీ పాలకవర్గం తీసుకున్న చర్యలకు స్థానిక ప్రజలు, వినియోగదారులు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ జెండాలతో సమైక్యతా ర్యాలీ

నర్సీపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ భావం ఉట్టిపడేలా పట్టణంలో వివిధ స్వచ్ఛంద సేవా సంఘాల ప్రతినిధులు జాతీయ జెండాలు చేతపట్టి సోమవారం సమైక్యతా ర్యాలీ నిర్వహించారు. పెహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మృత్యువాత పడిన పర్యాటకుల కుంటుంబ సభ్యులకు మనోధైర్యం, భారత సైన్యానికి సంఘీభావం తెలుపుతూ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మినీ స్టేడియం గాంధీ విగ్రహం దగ్గర నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ సాగింది. జాతీయ సమైక్యత వర్ధిల్లాలని, భారత మాతాకి జై, ఉగ్రవాదులు నశించాలని నినాదాలు చేశారు. ఆర్టీసీ కూడలి వద్ద మానవహారం నిర్వహించి, పెహల్గాం దాడిలో అసువులు బాసిన పర్యాటకులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సంఘాల ప్రతినిధిలు, లయన్స్, నవ్య లయన్స్, వాసవీ, రోటరీ, సిటీ క్లబ్ సంఘాల ప్రతినిదులు, ప్రైవేటు స్కూళ్లు, కళాశాలల అసోసియేషన్ నాయకులు, ప్రభుత్వ పింఛనుదారుల సంక్షేమ సంఘం సభ్యులు, నింజాస్ అకాడమీ విద్యార్థులు, ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని వాలీబాల్, షటిల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.



పట్టణంలో జాతీయ సమైక్యతా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తకోటలో పట్టపగలు చోరీ

- బంగారం, వెండి వస్తువుల అపహరణ

రావికమతం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట గ్రామంలో దుప్పట్ల సత్యవతి ఇంట్లో సోమవారం పట్టపగలు చోరీ జరిగింది. నాలుగు తులాల బంగారం, 15 తులాల వెండి ఆభరణాలను దొంగలు అపహరించుకుపోయారు. దుప్పట్ల సత్యవతి, రాజారావు దంపతులు సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసుకుని ఉపాధి పనులకు వెళ్లారు. ఈ సమయంలో ఆగంతుకులు ఇంట్లోకి ప్రవేశించి బీరువా బాక్సులో భద్రపరిచిన నాలుగు తులాల బంగారం పుస్తెల తాడు, ఇతర వస్తువులను, 15 తులాల వెండి ఆభరణాలను దొంగించుకుపోయారు. ఉపాధి పనుల నుంచి ఇంటికి వచ్చిన సత్యవతి, రాజారావు తలుపులు తెరిచి ఉండడంతో లోపలికి వెళ్లి పరిశీలించారు. బీరువాలో ఉంచిన బంగారం, వెండి వస్తువులు కనిపించకపోవడంతో చోరీ జరిగిందని లబోదిబోమన్నారు. ఈ విషయమై ఎస్ఐ శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా, సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలన చేస్తున్నామని తెలిపారు. అయితే బంగారం చోరీపై బాధితురాలు నుంచి తమకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మేడివాడ జెడ్పీ హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

రావికమతం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2014-15 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ పాఠశాలలో వంద మంది విద్యార్థులు ఆ బ్యాచ్‌లో పదో తరగతి చదువుకున్నారు. వారంతా వివిధ ఉద్యోగాలు, వ్యాపారులతో పాటు గృహిణులుగా స్థిరపడ్డారు. తాము చదువుకున్న హైస్కూల్‌కు చేరుకుని నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కుశల ప్రశ్నలతో పలకరించుకుని, వారి స్థితిగతులు, పిల్లల చదువుల గురించి ఆరా తీశారు. రోజంతా సరదాగా, ఉత్సాహంగా గడిపారు. మధ్యాహ్నం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులు నాగేశ్వరరావు, ఉమామహేశ్వరావు, మహాలక్ష్మి, నాగరాజును సన్మానించారు. పూర్వ విద్యార్థులు వాలిశెట్టి సాయి, పి.కృష్ణ, భాను, చిరంజీవి, మేరీ, సాయిలక్ష్మి, సత్యమణి ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి.

సమస్యలు పరిష్కరించాలని డోలీలతో నిరసన



డోలీలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

నర్సీపట్నం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): తమ గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గిరిజనులు సోమవారం డోలీలతో నిరసన కార్యక్ర మం నిర్వహించారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ర్యాలీగా వచ్చి అధికారులకు వినతిపత్రం అందజేశారు. గొలుగొండ మండలం డొంకాడ గిరిజన గ్రామానికి రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. 2023లో కరక నుంచి డొంకాడ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.3 కోట్లు మంజూరు చేశారని, ఇప్పటికీ ఆ పనులు ప్రారంభం కాలేదని ఫిర్యాదు చేశారు. పనసలపాడు, కొగుంట గిరిజన భూములకు రక్షణ కల్పించాలని, బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజనులు జీలుగ కల్లు తీసుకుంటే ఎక్సైజ్ అధికారులు కేసులు పెడుతున్నారని, బెల్టు షాపులపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకుడు కె.గోవిందరావు పాల్గొన్నారు.

రెల్లలపాలెం గ్రామానికి రోడ్డు నిర్మించాలని...

చీడికాడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కోనాం పంచాయతీలోని రెల్లలపాలెం గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించాలని గిరిజనులు, చిన్నారులు సోమవారం వినూత్నంగా నిరసన తెలిపారు. చంద్రబాబు తాతయ్య.. పవన్ కల్యాణ్ మావయ్య.. అంటూ రెండు ఫొటోలను చిన్నారుల మెడలో వేసుకొని నిరసన ప్రదర్శన చేశారు. వారికి ఆదివాసీ గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెల్లలపాలెం గిరిజన గ్రామానికి రోడ్డు, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు లేకపోవడంతో చిన్నారులు, విద్యార్థులు అంగన్‌వాడీ, పాఠశాలలకు వెళ్లలేకపోతున్నారని వాపోయారు. అత్యవసరమైతే డోలీమోతలు తప్పడం లేదన్నారు. కార్యక్రమంలో ఇరటా ఈశ్వరయ్య, కోట గంగమ్మ, దాయిరి దేముడమ్మ, కోట మల్లమ్మ, సోమల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మోస్తరు వర్షం..



గొలుగొండ ప్రధాన రహదారిలో కురుస్తున్న వర్షం... (ఇన్‌సెట్‌లో) కె.కోటపాడు మండల కేంద్రంలో హోరున పడుతున్న వాన

గొలుగొండ/కృష్ణాదేవిపేట/కె.కోటపాడు/మాడుగుల రూరల్/బుచ్చెయ్యపేట/చీడికాడ, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నర్సీపట్నం, చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని చాలా మండలాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట, లింగంపేట, విప్పలపాలెం, ఏఎల్‌పురం, చోద్యం, సీహెచ్.నాగాపురం, కొంగసింగి తదితర గ్రామాల్లో మోస్తరు వర్షం పడింది. వారం రోజులుగా ఎండతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వాన ఉపశమనం కల్పించింది. అలాగే కె.కోటపాడు మండలంలోని పలు గ్రామాల్లో కొద్ది రోజులుగా ఎండ తీవ్రతతో అల్లాడిపోయిన ప్రజలు ఒక్కసారిగా వాతావరణం మారిపోయి వర్షం కురియడంతో సేదదీరారు. బుచ్చెయ్యపేట మండలంలో మధ్యాహ్నం వరకు ఎండ వేడిమికి జనాలు ఇబ్బంది పడ్డారు, ఉష్ణోగ్రత తట్టుకోలేక విలవిలాడారు. ఇంతలోనే వాన పడడంతో వారంతా హర్షం వ్యక్తం చేశారు. అలాగే చీడికాడలో ఉదయం నుంచి మధ్యాహ్నం ఎండతీవ్రత ఉంది. తర్వాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. ఆకాశమంతా మేఘావృతమై ఈదురుగాలులు వీస్తూ వాన పడింది. మూడు గంటల సమయంలో మేఘం వేయడంతో పాటు చిన్నపాటి చినుకులు పడడంతో ప్రజలు చల్లదనాన్ని ఆస్వాదించారు.

టెన్త్‌లో ప్రతిభావంతులకు సత్కారాలు



పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

చోడవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని ఎంఈవోలు బి.పడాల్‌దాస్, కె.సింహాచలం విజ్ఞప్తి చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో అధిక మార్కులు సాధించిన 16 మంది విద్యార్థులను ఎంఈవోల ఆధ్వర్యంలో విద్యా శాఖ సిబ్బంది సత్కరించారు. తల్లిదండ్రులు ప్రైవేటు స్కూళ్ల వ్యామోహంలో పడి ప్రభుత్వ స్కూళ్లను పట్టించుకోకపోవడం సరికాదని ఆయన పేర్కొన్నారు. మెరుగైన సౌకర్యాలతో పాటు, నిపుణులైన ఉపాధ్యాయులతో కూడిన ఉత్తమ బోధన ప్రభుత్వ స్కూళ్లలోనే లభ్యం అవుతుందన్నారు. అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్లల్లోనే చదివించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు కేవీఎం నాయుడు, సుబ్రహ్మణ్యం, రవిశంకర్, సరోజిని, భూలక్ష్మి, నాగలక్ష్మి, చంద్రిక, సత్యనారాయణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పదో తరగతి ప్రతిభావంతులను లక్ష్మీపురంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నీలం నాగేంద్రబాబు, పసుమర్తి సాంబశివరావు, సర్వీస్ ఛైర్‌పర్సన్‌లు ముక్కా రమేశ్, డాక్టర్ శకుంతలరావు, సాయిరాం శ్రీను, గనిరెడ్డి, ఫల్గుణ్, ఉగ్గిన నాగబాబు, వేపాడ సత్యనారాయణ, గంగాధర్, విజయబుజ్జిరెడ్డి, శ్రీనివాస్, సతీశ్ వర్మ, కాంట్రాక్టర్ సుంకర సత్యనారాయణ, శ్రీనివాసరావు మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ ప్రదర్శన

చోడవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్ పెహల్గాంలోని ఉగ్రదాడిని నిరసిస్తూ జిల్లా మానవహక్కుల కౌన్సెల్ చోడవరం శాఖ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదం నశించాలి, ప్రపంచశాంతి వర్ధిల్లాలని కోరుతూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జంపా ఈశ్వరరావు, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల కన్వీనర్ నవకుమార్, ప్రోగ్రాం కార్యదర్శి జోగా తరుణ్‌తేజ, మొల్లి నాగేశ్, జోగ చందు, సింగంపల్లి చంద్రశేఖర్, గోపి, దీపక్, చంద్రమౌళి, నాయుడు, పైడినాయుడు, ఫాదర్ పి.అగ్రహం, ఆనంద్, మూర్తి పాల్గొన్నారు.

టీడీపీ గ్రామ కమిటీల ఎన్నికలు

మాడుగుల రూరల్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇఅవురువాడ, కింతలి, వల్లాపురం, జమ్మాదేవిపేట గ్రామాల్లో టీడీపీ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఏఎంసీ ఛైర్మన్ పుప్పాల అప్పలరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అద్దిపల్లి జగ్గారావు, ప్రధాన కార్యదర్శి ఉందూరు దేముడు, క్లస్టర్ ఇన్‌చార్జి పుప్పాల రమేశ్, భీశెట్టి శ్రీనివాసు ఆధ్వర్యంలో నియామక పత్రాలను అందించారు. అవురువాడ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ధారా భీమరాజు, తంటపురెడ్డి వరహాలనాయుడు, కింతలి వల్లాపురంలో మజ్జి బాబ్జీ, భూషణం, కింతలిలో పల్లారాము, కోన నాగరాజు, జమ్మాదేవిపేటలో అర్జున, వెల్లంకి సత్యనారాయణలను నియమించారు. టీడీపీ నాయకులు వడ్డిరాజ్‌కుమార్, చక్రవర్తి రాజు పాల్గొన్నారు.



దీక్షలో నినాదాలు చేస్తున్న కార్మికులు

లేటరైట్ అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

నర్సీపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరకోట పంచాయతీ బమిడికలొద్ది గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న లేటరైట్ తవ్వకాలు, అక్రమ రవాణా, రాయల్టీ మోసాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకరగణేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నర్సీపట్నంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రోజుకు ఐదు వేల టన్నుల ఖనిజాన్ని తరలిస్తూ కేవలం వెయ్యి టన్నులకు మాత్రమే రాయల్టీ చెల్లిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. లేటరైట్ తరలిస్తున్న వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ లేకుండా రవాణా చేస్తున్నారని ఆరోపించారు. నర్సీపట్నం గనుల శాఖ పరిధిలో కాకుండా కాకినాడ జిల్లా నుంచి రాయల్టీ పర్మిట్లు ఇస్తున్నారని, దీనిపై విచారణ చేయాలని ఆయన కోరారు.

మహా సూర్య వందనంలో యోగా గురువుల ప్రతిభ

చోడవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): నూటఎనిమిది నిమిషాల్లో 108 సార్లు సూర్య నమస్కారాల విన్యాసంలో ప్రాతినిధ్యం వహించిన పతంజలి యోగా కేంద్రం గురువు, రాష్ట్ర యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పుల్లేటి సతీశ్, మరో యోగా గురువు అరైపు శ్రీనివాస్‌లను నిర్వాహకులు విశాఖలో సత్కరించారు. అల్లూరి జిల్లా అరకులోయలో ఈ నెల 7న మహా సూర్య వందనం కార్యక్రమంలో భాగంగా 21,850 మంది విద్యార్థులతో మహా సూర్యవందనం కార్యక్రమం నిర్వహించడం రికార్డు సృష్టించింది. ఈ రికార్డులో భాగస్వామ్యులైన యోగా గురువులు సతీశ్, శ్రీనివాస్‌లను విశాఖనగరంలోని బీజేపీ కార్యాలయంలో సత్కరించి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

అక్విడక్ట్ మరమ్మతుకు శంకుస్థాపన

నాతవరం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్సంపేట వద్ద అక్విడెట్ మరమ్మతు పనులకు తాండవ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కరక సత్యనారాయణ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2 కోట్లతో ఈ పనులు చేపడుతున్నట్టు చెప్పారు. అన్ని పనులు పూర్తయితే వచ్చే ఖరీఫ్ నాటికి తాండవ ఆయకట్టు చివరి భూములకు కూడా సాగునీరు అందుతుందన్నారు. అలాగే తాండవ రిజర్వాయర్‌కు సంబంధించి 103 పనులకు రూ.14 కోట్లు మంజూరు చేయాలని ఇరిగేషన్ మంత్రికి వినతిపత్రం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో తాండవ ఏఈ ప్రేమ్‌కుమార్, ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ జోగిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, తాండవ నీటి సంఘం అధ్యక్షుడు పారుపల్లి దాసు, నాయకులు ఎం.సత్యప్రసాద్, జి.శ్రీనివాసరావు, సీతారామ్మూర్తి, జె.రాజుబాబు, శెట్టి లోవ, సిహెచ్.శ్రీనివాస్, శెట్టి నానాజీ, కె.గోవిందరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎంయూ రిలే దీక్షలు

నర్సీపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు రెండు రోజులు రిలే దీక్షలను సోమవారం ప్రారంభించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని కేటగిరీల ప్రమోషన్లు ఇప్పించాలని, అక్రమ సస్పెన్షన్లు, తొలగింపులు ఆపాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని అమలు చేయాలని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని కోరారు. రిలే దీక్షలలో సంఘ ప్రతినిధులు వైవీ రావు, కె.రమణ, ఐ.రమణ, పి.లక్ష్మణుడు, బీఎ.నాయుడు, కేఏరావు, కోలా శంకరావు, ఆర్ఎన్.రాజు, పీకేరావు. దాసు పాల్గొన్నారు.

కాలానుగుణ పంటలపై అవగాహన

రావికమతం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కాలానుగుణంగా పంటల సాగు విధానంపై శ్రీకాకుళం వ్యవసాయ కళాశాల విద్యార్థినులు సోమవారం మత్స్యవానిపాలెంలో రైతులకు అవగాహన కల్పించారు. కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రాజకుమార్, టీవోటీ కిశోర్‌కుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటలకు చీడపీడలు లేకుండా, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చే విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థినులు అంకిత, రచన, బిందు, మాధవి, మణిదీపిక, చరిష్మా, మేఘన పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతి



సూర్యప్రకాశ్

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): పాతకృష్ణాదేవిపేట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పుట్టా సూర్యప్రకాశ్ (55) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన జాతీయ మానవ హక్కుల సంఘం జోనల్ కార్యదర్శిగా కూడా పనిచేశారు. సూర్య ప్రకాశ్ మృతికి టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్, చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, నాయకులు సిహెచ్.సాంబమూర్తి, జి.సత్యనారాయణ సంతాపం తెలిపారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

రోలుగుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు రుణాలను అందించడానికి ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నదని ఎంపీడీవో నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్, బుద్దిస్ట్, సిఖ్, జైన్, పార్సీలకు చెందిన వారంతా ఆధార్, రేషన్ కార్డులు, కుల ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 50 శాతం రాయితీపై అందించే ఈ రుణాలకు 21 ఏళ్ల నుంచి 55 ఏళ్ల అభ్యర్థులు అర్హులుగా ఆయన పేర్కొన్నారు.

పీఏసీఎస్‌లో బినామీ రుణాలపై విచారణ చేపట్టాలి

రోలుగుంట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జానకిరాంపురం పీఏసీఎస్‌లో బినామీ రుణాలపై విచారణ చేపట్టాలని పీజీఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్‌కు సోమవారం సంఘ సభ్యులు కిల్లాడ సాంబమూర్తినాయుడు, గొల్లు నారాయణరావు, కిల్లాడ అప్పల సీతయ్యనాయుడు, గొల్లు కల్పన, పి.శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. స్థానిక బినామీ నాయకుల ఒత్తిడితోనే విచారణ జరగకుండా అడ్డుకుంటున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. సెక్షన్ 51 కింద విచారణ చేపట్టాలని వారు విన్నవించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని త్వరతగతిన ప్రక్రియ పూర్తి చేసి రైతులకు న్యాయం చేయాలని వారు విన్నవించారు.

పీలా శ్రీనివాసరావు అనే నేను..



మేయర్‌గా పీలా శ్రీనివాసరావుతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న జేసీ మయూర్ అశోక్



మేయర్‌గా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం పీలా శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న కూటమి ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు, పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ చిరంజీవిరావు

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్‌గా తెలుగుదేశం పార్టీకి చెందిన 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు సోమవారం ఎన్నిక కావడంతో కూటమి శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. పీలా శ్రీనివాసరావును నాయకులు, కార్యకర్తలు అభినందించి సత్కరించారు. ఆయనను అభినందించిన వారిలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉన్నారు.

- విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి



మేయర్ శ్రీనివాసరావును గజమాలతో సత్కరించి అభినందిస్తున్న కార్యకర్తలు



పీలా శ్రీనివాసరావును అభినందిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు. చిత్రంలో పీలా గోవింద ఉన్నారు.

బ్రాండిక్స్‌పై తప్పుడు ప్రచారం తగదు

» సంస్థ భారత భాగస్వామి దొరస్వామి

అనకాపల్లి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం సెజ్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న 'షోర్ టు షోర్' కంపెనీకి సంబంధించిన అంశంలో బ్రాండిక్స్ సంస్థపై తప్పుడు ప్రచారం చేయడం దురదృష్టకరమని బ్రాండిక్స్ ఇండియా భారతీయ భాగస్వామి దొరస్వామి సోమవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీలంకకు చెందిన ఒక మాజీ సీఈఓ, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మహిళా హెచ్‌ఆర్‌పై లైంగిక దాడికి పాల్పడ్డారనే విషయం షోర్ టు షోర్ కంపెనీ అంతర్గతమైనదని పేర్కొన్నారు. ఆరోపణలు చేస్తున్న, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులకు బ్రాండిక్స్ సంస్థతో ఎటువంటి సంబంధం లేదని, స్పష్టం చేశారు. బ్రాండిక్స్‌లో అత్యుత్తమ సంరక్షణ ప్రమాణాలను పాటిస్తూ మహిళా హక్కులను సంస్థ గౌరవిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఈదురుగాలులతో భారీ వర్షం



కామిరలో వర్షం

రావికమతం, ఏప్రిల్ 28,(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ కాయగా, మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి వర్షం మొదలైంది. దీంతో పలుచోట్ల మామిడి కాయలు నేలరాలాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. ఈ వర్షం వల్ల పశుగ్రాసం పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

విశాఖ రియల్టర్ మామిడిపల్లిలో ఆత్మహత్య

... 5వ పేజీ తరువాయి

ద్వారా పోలీసులకు, సత్యనారాయణరాజు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. హెచ్‌సీ బి.ప్రకాశరావు వచ్చి పరిశీలించారు. ఆరుగురు వ్యక్తులను ఉద్దేశించి విడివిడిగా రాసిన లేఖలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తనకు రావాల్సిన బకాయిలు, తాను చెల్లించాల్సిన బకాయిల వివరాలను ఆ లేఖల్లో పేర్కొన్నట్టు తెలిసింది. సత్యనారాయణరాజుకు భార్య విజయలక్ష్మి, కుమారుడు సాయి చైతన్య వర్మ ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌చార్జి ఎస్‌ఐ చెప్పారు.

రాయి క్వారీల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

» జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా

తుమ్మపాల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): రాయి క్వారీల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా, పలు క్వారీల యాజమాన్యాలకు స్పష్టం చేశారు. సోమవారం రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి మార్టూరులో పలు రాయి క్వారీలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతీ క్వారీ, క్రషర్‌లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. వీటి వద్ద యాజమాన్యం వివరాలు తెలిసేలా సరిహద్దులు నిర్ణయిస్తూ బోర్డులు పెట్టాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మైన్స్, రెవెన్యూ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి, నిబంధనలు పాటించని క్వారీ, క్రషర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనలు పాటించకుండా, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న క్వారీలు, క్రషర్ల యాజమాన్యాలపై కేసులు నమోదు చేయాలని సూచించారు. ఎస్పీ వెంట రూరల్ సీఐ జి.అశోక్ కుమార్, ఎస్‌ఐ జి.రవికుమార్, సిబ్బంది వున్నారు.



క్వారీల్లో తనిఖీ చేసిన అనంతరం పోలీస్ అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

సమాజ సేవకులను ప్రోత్సహించాలి

» ఒడిశా గవర్నర్ డాక్టర్ హరిబాబు

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 28, (ఆంధ్రజ్యోతి): సమాజంలో మంచి పనులు చేస్తున్న వారిని అభినందించి, ప్రోత్సహించాలని ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు అన్నారు. మండలంలోని కొండకర్లలో అనాథ, దివ్యాంగుల ఆశ్రమం 'ఇచ్ఛా' ఫౌండేషన్‌లో విశాఖకు చెందిన అవేకనింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి గవర్నర్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఆర్టిఫిషియల్ లింబ్ ఫ్యాక్టరీ ద్వారా దివ్యాంగులకు ఉపకరణాలు తయారు చేయించి ఉచితంగా పంపిణీ చేస్తున్నదని చెప్పారు. ప్రభుత్వంపై ఆధార పడకుండా దాతల సహాయంతో దివ్యాంగులకు ఇచ్ఛా ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ఆశ్రమానికి పలువురు దాతలు ఇచ్చిన చెక్కులతోపాటు తన సొంత సొమ్ము రూ.25 వేలను నిర్వాహకులకు అందజేశారు. అనంతరం సమీపంలో కొండకర్ల ఆవను సందర్శించి, పకృతి అందాలను ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మధు తుగ్నైట్, సంస్థ ప్రతినిధులు ప్రసాద్, రమేశ్ రాజు, బీజేపీ నాయకులు గొంతిన భక్తసాయిరాం, రాజాన సన్యాసినాయుడు, అగ్గాల హనుమతరావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు

బీఎన్ రోడ్డుకు మోక్షం లేదా?

... 5వ పేజీ తరువాయి

ఒత్తిడి మేరకు రోలుగుంట నుంచి బుచ్చెయ్యపేట మండలం వడ్డాది వరకు పనులు చేయడానికి అంగీకరించిన సబ్ కాంట్రాక్టర్.. పనులు జరుగుతున్న తీరు చూస్తే ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించడంలేదు. వైసీపీ హయాంలో బీఎన్ రోడ్డు పనులు చేయించలేకపోయారని విమర్శలు చేసిన కూటమి నేతలు, తాము అధికారంలోకి వచ్చిన తరువాత అదే పరిస్థితి తమకు ఎదురవడంతో ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు.

కొత్త వంతెనలకు మోక్షం లేదా?

బీఎన్ రోడ్డులో బుచ్చెయ్యపేట మండలం వడ్డాది వద్ద రెండేళ్ల క్రితం వంతెన కూలిపోయింది. ఇక్కడ ప్రత్యామ్నాయంగా తక్కువ ఎత్తులో కల్వర్టు నిర్మించారు. ఆరు నెలల తరువాత విజయరామరాజుపేట వద్ద తాచేరు నదిపై వంతెన కూలిపోయింది. ఈ రెండు చోట్ల కొత్త వంతెన నిర్మాణం ఊసేలేదు. విజయరామరాజుపేట వద్ద కూలిన వంతెన పక్కన నిర్మించిన అప్రోచ్ రోడ్డు ప్రమాదకరంగా ఉంది. నదుల్లో వరద పెరిగితే వడ్డాది వద్ద కల్వర్టు, విజయరామరాజుపేట వద్ద అప్రోచ్ రోడ్డుమీదుగా నీరు ప్రవహించి వాహనాల రాకపోకలు నిలిచిపోతాయి.

ప్రతిపాదనల్లోనే రెండు వరుసల రహదారి నిర్మాణం

బీఎన్ రోడ్డును పీపీపీ విధానంలో రెండు లేన్ల రహదారిగా విస్తరించేందుకు ప్రభుత్వం సంకల్పించిన సంగతి తెలిసిందే. ఈ రహదారి అభివృద్ధి బాధ్యతను ఈసీసీ అనే కంపెనీకి అప్పగించారు. కానీ డీపీఆర్ తయారీకి ఇంకా సమయం పట్టే అవకాశం ఉంది. రోడ్డు నిర్మాణంలో భూములు, స్థలాలు కోల్పోయే వారి వివరాలు, మధ్యలో గెడ్డలు, నదులపై నిర్మించాల్సిన వంతెనలు, కల్వర్టులు, తదితర వివరాలతో డీపీఆర్ తయారీకి కనీసం ఏడాది పట్టే అవకాశం ఉందని అధికారవర్గాల సమాచారం. ఇది పూర్తయి, డీపీఆర్‌కు ప్రభుత్వం ఆమోదం తెలిపి, టెండర్లు పిలిచి, రోడ్డు నిర్మాణ పనులు మొదలు కావడానికి కనీసం రెండేళ్ల సమయం పడుతుందని అంటున్నారు. అప్పటికి బీఎన్ రోడ్డు మరింత అధ్వానంగా తయారవుతుంది.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

... 5వ పేజీ తరువాయి

రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. వృద్ధుల కోసం టెంట్, కుర్చీలు, తాగునీరు, వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నిరక్షరాస్యులకు అర్జీలు రాయడానికి వీఆర్‌వోలను అందుబాటులో వుంచారు. వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 257 అర్జీలు అందజేశారు.

వేములపూడిలోని గుండాలమ్మ చెట్టు వీధిలో చింతల నానాజీ అనే వ్యక్తి పంట కాలువ ఆక్రమించి షెడ్డు నిర్మాణం చేశాడని అదే గ్రామానికి చెందిన నక్కపల్లి రమణ ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్మికుల 18 నెలల వేతన బకాయిలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు కోరారు. నర్సీపట్నం ఎక్సైజ్ స్టేషన్ పక్కన వున్న తన ఖాళీ స్థలంలో గంజాయి, సారా, మద్యం కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను ఉంచడం వల్ల ఇబ్బందికరంగా వుందని కొలుకుల పరమేశ్వరావు ఫిర్యాదు చేశారు. నర్సీపట్నంలో బ్రిటీష్ అధికారుల సమాధుల వున్న స్థలాన్ని అల్లూరి స్మారక ప్రాంతంగా అభివృద్ధి చేసి, ఆక్రమణలు తొలగించాలని అల్లూరి స్మారక ప్రాంతాల పరిరక్షణ కమిటీ కన్వీనర్ పీవీ సత్యనారాయణరావు కోరారు. రోలుగుంట మండలం లోసింగిలో ఆదివాసీలు సాగుచేసుకుంటున్న భూమికి పట్టాలు ఇవ్వాలని అర్జీ అందజేశారు.

చందనోత్సవానికి సర్వం సిద్ధం

... 5వ పేజీ తరువాయి

చెప్పారు. ఉచిత దర్శనాలు తెల్లవారుజామున నాలుగు గంటలకు ప్రారంభమవుతాయన్నారు. భక్తులందరూ సొంత వాహనాలను కొండ దిగువనే వదిలి దేవస్థానం ఏర్పాటు చేసిన ఉచిత రవాణా సదుపాయాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

టికెట్లు...ఇక్కట్లు

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): సింహాచలేశుని నిజరూప ఉచిత దర్శనానికి కనీసం నాలుగు గంటలు పట్టే అవకాశం, కనీసం పది కిలోమీటర్లు క్యూలో నడవాల్సి ఉండడంతో అత్యధికులు ఏదో ఒక టికెట్ కొని దర్శించుకోవాలని భావిస్తున్నారు. అయితే కేవలం రూ.300 టికెట్ తప్పితే ఇంకేమీ లేవని సింహాచలంలోని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. అవి కూడా బుధవారం మధ్యాహ్న దర్శనానికి మాత్రమే ఉన్నాయని సోమవారం వెల్లడించారు. దర్శనాల కోసం దేవస్థానం అధికారులు రూ.1,500, రూ.1,000, రూ.300 విలువైన టికెట్లు ముద్రించి విక్రయాలకు సిద్ధం చేశారు. ఇందులో రూ.1,500 విలువైన టికెట్లు వీవీఐపీలకు, ప్రొటోకాల్ దర్శనాలకు ఇస్తామని వెల్లడించారు. అవి సుమారు 2,500 టికెట్లు ముద్రించామని చెప్పారు. సోమవారం రాత్రి వరకు వీటిని ఎవరికీ జారీ చేయలేదు.

మేయర్ పీఠంపై పీలా

... 5వ పేజీ తరువాయి

59 మంది కార్పొరేటర్లు, ఏడుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ మొత్తం 67 మంది హాజరవ్వడంతో ఎన్నిక ప్రక్రియను ప్రారంభిస్తున్నట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు. అనంతరం మేయర్‌గా పోటీ చేసే అభ్యర్థిని ఎవరైనా ఒక సభ్యుడు ప్రతిపాదించి, మరొక సభ్యుడు బలపరచాలని కోరారు. దీంతో మేయర్ పదవికి పీలా శ్రీనివాసరావు పేరును జనసేనకు చెందిన దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రతిపాదించారు. బీజేపీకి చెందిన ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు బలపరిచారు. ఇంకెవరైనా పోటీలో ఉన్నారా?...అని ఎన్నికల అధికారి ప్రశ్నించగా, సభ్యులంతా ఎవరూ లేరని చెప్పడంతో పీలా శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. సభ్యులందరూ బల్లలు చరిచి హర్షం వ్యక్తంచేశారు. మేయర్‌గా ఎన్నికైనట్టు పీలా శ్రీనివాసరావుకు జాయింట్ కలెక్టర్ ధ్రువీకరణ పత్రం అందజేసి, ఆయన చేత ప్రమాణం చేయించి సమావేశం ముగిసినట్టు ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణశ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, గణబాబు, పల్లా శ్రీనివాసరావు, పంచకర్ల రమేష్‌బాబు, కొణతాల రామకృష్ణ, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కూటమి కార్పొరేటర్లు, జీవీఎంసీ అధికారులు, కూటమి నేతలతోపాటు అభిమానులు నూతన మేయర్ పీలా శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు. మేయర్‌గా పీలా ఎన్నికతో జీవీఎంసీ కార్యాలయం బయట టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కాగా కార్పొరేషన్ చరిత్రలో టీడీపీ నుంచి 1987లో మొదటిసారి డీవీ సుబ్బారావు మేయర్‌గా ఎన్నికవ్వగా, రెండో వ్యక్తి పీలా శ్రీనివాసరావు కావడం విశేషం.

క్రైం... crime news

స్నానానికి నేలబావిలో దిగి ఒకరి మృతి

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నుంచి తోటాడకు వెళ్లే మార్గంలో వున్న నేలబావిలో స్నానానికి దిగి ఒక వ్యక్తి మృతిచెందాడు. పట్టణ ఎస్‌ఐ కె.సంతోష్‌కుమార్ తెలిపిన సమాచారం మేరకు.. గవరపాలెం చినరామస్వామికోవెల ప్రాంతానికి చెందిన పొలిమేర నాయుడు (46) ఆదివారం సాయంత్రం స్నానం చేయడానికి నేల బావిలో దిగాడు. అయితే ఇతనికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోతూ బిగ్గరగా కేకలు వేశాడు. సమీపంలో వున్న రైతులు వచ్చి, బావిలో నుంచి నాయుడును బయటకు తీశారు. అప్పటికే స్పృహకోల్పోవడంతో ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారన్నారు. పరీక్షించిన వైద్యులు.. అప్పటికే చనిపోయినట్టు నిర్ధారించారన్నారు. నాయుడు మార్కెట్‌లో కలాసీగా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నాడు. భార్య కృష్ణవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధి శ్రామికుడి మృతి



మరిడయ్య(ఫైల్ ఫొటో)

మాకవరపాలెం, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపాలెం గ్రామానికి చెందిన ఓ ఉపాధి శ్రామికుడు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు. దీనికి సంబంధించి ఆమె తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. బూరుగుపాలెం గ్రామానికి చెందిన ఉమ్మాక మరిడయ్య(40) శనివారం ఉపాధి పనులకు వెళ్లాడు. అయితే పనులు చేస్తూ స్పృహ తప్పి పడిపోవడంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్టు వైద్యులు తెలిపారని ఎంపీడీవో పేర్కొన్నారు.

రిపోర్టర్లమంటూ బెదిరించిన నలుగురిపై కేసు

ఎలమంచిలి, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లైనుకొత్తూరు సమీపంలో రిపోర్టర్లమంటూ ఓ వ్యక్తిని బెదిరించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ ధనుంజయరావు తెలిపారు. సోమవారం రాత్రి తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించిన వివరాలిలా వున్నాయి. కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం మల్లవరం గ్రామానికి చెందిన పోలవర్తి అప్పలనాయుడు ఆదివారం సాయంత్రం కోళ్ల వ్యర్థాలను వ్యాన్‌లో తరలిస్తుండగా లైనుకొత్తూరు సమీపంలో కారులో వచ్చిన నలుగురు వ్యక్తులు అడ్డుకున్నారు. తాము ప్రెస్ రిపోర్టర్లమని చెప్పి వ్యాన్ డ్రైవర్‌ను బెదిరించి రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డ్రైవర్ డబ్బులు ఇవ్వకపోవడంతో అతని సెల్‌ఫోన్ లాక్కొని వెళ్లిపోయారు. దీంతో అప్పలనాయుడు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వ్యాన్ డ్రైవర్‌ను బెదిరించి వ్యక్తులు విశాఖకు చెందిన చప్పా మోహన్ కృష్ణ, బంగారి భరత్, ఎండ్రపల్లి తిరుపతి, వానపల్లి శ్రీనువాసులుగా గుర్తించారు. వీరిని అదుపులోకి తీసుకుని కారును సీజ్ చేశారు. నోటీసులు ఇచ్చి విడిచిపెట్టామని, పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని సీఐ చెప్పారు.

అధిక లోడు లారీకి రూ.73 వేలు జరిమానా

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ నుంచి రాజమహేంద్రవరం వైపు భారీ లోడు వెళుతున్న లారీని జాతీయ రహదారిలో నూకాంబిక ఆలయ ముఖద్వారం వద్ద సోమవారం అడ్డగించి స్వాధీనం చేసుకున్నట్టు ట్రాఫిక్ ఎస్‌ఐ శేఖరం తెలిపారు. అనంతరం లారీని రవాణా శాఖ కార్యాలయానికి అప్పగించగా రూ.73 వేలు జరిమానా విధించారని చెప్పారు.

విద్యుత్ వైర్ల దొంగల అరెస్టు



స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు, పట్టుకున్న నిందితులతో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ, ఎస్‌ఐ, పోలీసు సిబ్బంది


» 850 కిలోల వైర్లు, రూ.84,000 నగదు, కారు స్వాధీనం

» నిందితుల్లో ఐదుగురు అల్లూరి జిల్లా వాసులు

పాయకరావుపేట, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : వివిధ ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు చోరీ చేస్తున్న అంతర్ జిల్లాల దొంగల ముఠాను పాయకరావుపేట పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి చోరీ సొత్తు, నగదు, కారు స్వాధీనం చేసుకున్నారు. నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు.

పాయకరావుపేట మండలం రాజగోపాలపురం గ్రామానికి చెందిన మంగి సుధాకర్‌రెడ్డి కొంతకాలంగా విజయనగరం జిల్లా కొత్తవలసలో స్క్రాప్ వ్యాపారం చేస్తున్నాడు. అంతకు ముందు ఇతను వైర్లను దొంగిలించి అమ్ముకునేవాడు. కాగా అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఐదుగురు యువకులతో ఒక ముఠాను ఏర్పాటుచేసి పలుచోట్ల విద్యుత్ వైర్లను చోరీ చేయించి స్క్రాప్‌గా అమ్ముతున్నాడు. ఇటీవల పాయకరావుపేట చుట్టుపక్కల ఇళ్ల స్థలాల లేఅవుట్లలోని విద్యుత్ స్తంభాల నుంచి వైర్లను చోరీ చేశారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల పుటేజీల ద్వారా నిందితులను పట్టుకున్నారు. వీరి నుంచి సుమారు 850 కిలోల విద్యుత్ వైర్లు, రూ.84,000 నగదు, చోరీకి ఉపయోగించే వస్తువులు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో మంగి సుధాకర్‌రెడ్డితోపాటు అరకులోయ మండలం, రంగినిగుడకు చెందిన కొర్ర రాజు, గొబ్బి కార్తిక్, జన్ని కిరణ్‌తోపాటు మరో ఇద్దరు బాల నేరస్థులు వున్నారు. సుధాకర్‌రెడ్డిపై గతంలో 25 కేసులు నమోదయ్యాయి. ఇతనిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని, నిందితుల్లో నలుగురిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలించామని, మిగిలిన ఇద్దరు బాల నేరస్థులను జువైనల్ హోమ్‌కి తరలిస్తామని తెలిపారు.

హెచ్చరిక స్తంభాన్ని ఢీకొన్న బైక్.. ఒకరి మృతి



సర్వారావు (ఫైల్ ఫొటో)

కోటవురట్ల, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రపురం జంక్షన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ రమేశ్ అందజేసిన వివరాల ప్రకారం.. ఎస్‌రాయవరం మండలం వమ్మవరం గ్రామానికి చెందిన కోరుప్రోలు వెంకట కనక సర్వారావు(50) నర్సీపట్నం శివపురంలో నివాసం ఉంటున్నాడు. మాకవరపాలెం మండలం రాచపల్లి జంక్షన్ వద్ద ఒక కిరాణా షాపులో పనిచేస్తున్నాడు. ఆదివారం భార్యను శివపురం నుంచి బైక్‌పై వమ్మవరం తీసుకెళ్లాడు. రాత్రికి అక్కడే వుండి, సోమవారం ఒక్కడే బైక్‌పై నర్సీపట్నం వస్తున్నాడు. కోటవురట్ల మండలం రామచంద్రపురం జంక్షన్ సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డుపక్కన వున్న ఆర్‌అండ్‌బీ హెచ్చరిక స్తంభాన్ని ఢీకొన్నాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య నాగరత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434